23-04-2024
మంగళవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 303
పేజీలు: 12 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 12
వెల రూ. 5.00
Published from:
**Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ.॥100/- పేజీలు:96

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



## మళ్లీ అదే పాట

**మారని ప్రధాని మోదీ**

**మహిళల బంగారంపై ప్రతిపక్షాలు కన్నుపడిందని అసంబద్ధ వ్యాఖ్యలు**

**ముస్లింల పేరెత్తకుండా 'అలీగఢ్'లో రెచ్చగొట్టే మాటలు**

అలీగఢ్ (ఉత్తర్‌ప్రదేశ్) : హిందువుల ఆస్తులను, మహిళల మంగళ సూత్రాలను ముస్లింలకు పునఃపంపిణీ చేస్తారని రాజస్థాన్‌లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్నప్పటికీ ప్రధాని మోదీ ధోరణి ఏ మాత్రం మారలేదు. మరుసటి రోజు సైతం అవే వ్యాఖ్యలను ఉత్తర్ ప్రదేశ్‌లోని అలీగఢ్‌లో చేశారు. అయితే, ఈసారి ముస్లింల పేరెత్తకుండా పరోక్షంగా వారి గురించి మాట్లాడారు. ఇండియా కూటమి నేతల కళ్ళు ఆడవారి మెడలో బంగారంపై పడిందని, వాటిని కొట్టేస్తారని అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో ఉంటే పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన తరువాయి 2లో

## ప్రధాని ఇంత దిగజారాలా?

ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి రాజ్ నుంచి దేశ విముక్తికి సిపిఐ పిలుపు 04

# అర్థం లేని ఆరోపణలు విద్వేష ప్రసంగాలు



## ప్రధాని నరేంద్ర మోదీపై ప్రతిపక్ష పార్టీల ఆగ్రహం

## ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ/ కర్నాటక:** ప్రధాని నరేంద్ర మోదీ అర్థం లేని ఆరోపణలు, విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, దేశ సంపద మొత్తం ముస్లిం వర్గాలకే వెళుతుందంటూ ఆయన వ్యాఖ్యానించడాన్ని వివిధ పార్టీలు తప్పుపట్టాయి. రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నప్పుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తాయి. మత విద్వేషాలు రెచ్చగొట్టే రీతిలో ప్రసంగాలను మానుకోవాలని ప్రధానికి హితవు పలికాయి. కాగా, దేశ సంపదలో మొదటి హక్కుదారులు ముస్లింలేనని మన్మోహన్ చెప్పినట్టు మోదీ చేసిన ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్, ఈ విషయంపై భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)కి ఫిర్యాదు చేసింది. అసత్యాలను ప్రచారం చేస్తున్న మోదీపై చర్య తీసుకోవాలని కోరింది.

**ప్రధాని అజ్ఞానంతో మాట్లాడొద్దు: ఖర్గే**

కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై ఎక్కడంటే అక్కడ మోదీతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ముస్లిం లీగ్ మ్యానిఫెస్టో అని, దేశ వ్యతిరేక మ్యానిఫెస్టో అని మోదీ అనడాన్ని తప్పుబట్టారు. తమ మ్యానిఫెస్టోలో ఒక్కొక్క అంశాన్ని చెబుతానని, అందులో ముస్లిం లీగ్‌తో ఏమి సంబంధం ఉన్నదో, ఎలా దేశ వ్యతిరేక మ్యానిఫెస్టో అవుతుందో చెప్పాలని మోదీకి సవాలు విసిరారు. ప్రధానమంత్రిగా ఉన్న మోదీ జ్ఞానంతో మాట్లాడాలే తప్ప అజ్ఞానంతో మాట్లాడవద్దన్నారు. కర్నాటలోని చన్నపట్టణ నియోజకవర్గంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజస్థాన్‌లో మోదీ ద్వేషప్రసంగంపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత జనాభా లెక్కల ద్వారా ప్రజల ఆస్తుల వివరాలు సేకరించి, వాటిని ముస్లింలకు ఇస్తారని అంటున్నారని పేర్కొన్నారు. ప్రధాని జ్ఞానంతో మాట్లాడాలే తప్ప అజ్ఞానంతో కాదన్నారు. దేశాన్ని ఎవరైనా విభజిస్తున్నారంటే అది మోదీ మాత్రమేనని, హిందువులు, ముస్లింలు, దళితులు, ఇతర కులాల మధ్య ప్రధానమంత్రి విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఖర్గే మండిపడ్డారు. ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేసి, వెళ్ళిపోవడం మోదీకి అలవాటేనని, అలా కాకుండా అంశాలపై చర్చించేందుకు తరువాయి 2లో

## ఓటమి భయంతోనే మోదీ వ్యాఖ్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను మతం పేరుతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు విమర్శించారు. ప్రజలందరినీ సమానంగా చూడాల్సిన ప్రధాని, ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా వైషమ్యాలను రాజేస్తున్నారని, ఇది స్పష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకమని, తక్షణమే ఎన్నికల కమిషన్ ప్రధాని వ్యాఖ్యలపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కూనంనేని సాంబశివరావు తరువాయి 2లో

## సుప్రీం సూమోటోగా తీసుకోవాలి



రాజస్థాన్ ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ మౌనం వహించడం ఘోరమని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి విమర్శించారు. మోదీ విద్వేష ప్రసంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా ఉల్లంఘించడమేనని, ద్వేష ప్రసంగాలపై సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధమైనదని తన ఎక్స్ ఖాతాలో ఆయన వ్యాఖ్యానించారు. కఠినమైన చర్యలకు, కోర్టు ధిక్కరణ కింద చర్యలకు ప్రధాని వ్యాఖ్యలు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ తరువాయి 2లో

## 30 వారాల గర్భం విచ్ఛిత్తికి 'సుప్రీం' అనుమతి

బాధిత మైనర్ శ్రేయస్సే కీలకమని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** అత్యాచారానికి గురైన ఓ మైనర్ బాలిక 30 వారాల గర్భం అబార్షన్‌కు సుప్రీంకోర్టు అనుమతించింది. కేసు పూర్వాపరాలు, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, రాజ్యాంగంలోని 142 అధికరణ ద్వారా సంక్రమించిన హక్కును ఉపయోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దీవాలాతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో, ఈ గర్భ విచ్ఛిత్తికి అనుమతిస్తున్నామని, ఇందులో తప్పులేదని వ్యాఖ్యానించింది. కేసు వివరాల్లోకి వెళితే, ముంబయిలోని సియాన్ (శివ్) ప్రాంతానికి చెందిన 14 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తాను గర్భం దాల్చిన విషయం ఆ బాలికకు ఆలస్యంగా తెలిసింది. దీనితో ఆమె తల్లిదండ్రులు గర్భ విచ్ఛిత్తికి అనుమతించాలని కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, బాలిక వయసు, అబార్షన్ కారణంగా తలెత్తే సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు ఈనెల 4వ తేదీన హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును పిటిషనర్లు సుప్రీం కోర్టులో సవాలు చేశారు. సియాన్‌లోని లోకమాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజీ, జనరల్ ఆసుపత్రి (ఎల్‌టిఎంజిహెచ్) నివేదికను కూడా సమర్పించారు. బాలిక ఇష్టానికి వ్యతిరేకంగా గర్భాన్ని కొనసాగిస్తే, ఆమె తీవ్ర శారీరక, మానసిక ఒత్తిళ్లకు లోనయ్యే ప్రమాదం ఉందని ఎల్‌టిఎంజిహెచ్ తన నివేదికలో పేర్కొంది. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు ప్రస్తావిస్తూ, కాన్పు సమయంలో తలెత్తే ప్రమాదాలతో పోలిస్తే, ఇప్పుడు అబార్షన్ చేస్తే ఎదురయ్యే సమస్యలు చిన్నవని వ్యాఖ్యానించింది. ప్రత్యేక వైద్య బృందానికి ఈ బాధ్యతను అప్పగించాలని ఎల్‌టిఎంజిహెచ్ అధికారులను ఆదేశించింది. మెడికల్ తరువాయి 2లో

# కాంగ్రెస్‌పై ప్రధాని అసత్య ప్రచారం

'తుమ్మిడిహెట్టి'కట్టి తీరుతాం

చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్‌పార్టీ ప్రచారసభలు

మల్కాజిగిరి జనజాతర సభకు చాడ వెంకట్‌రెడ్డి







ప్రజాపక్షం/ ఆదిలాబాద్/ ఇచ్చోడ/ మల్కాజిగిరి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని, కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని అసత్య ప్రచారం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల మాదిరిగా దొంగ వాగ్దానాలు తాము చేయబోమని, ఆగస్టు 15 లోపు రైతులకు రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల్లో అయిదు పథకాలను పకడ్బందీగా అమలు చేసామని, మిగితా పథకాలను త్వరలోనే అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి తప్పక ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్, కెటిఆర్ అవినీతి, కుంభకోణాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కానీ ప్రధాని మోదీ కానీ నోరెత్తరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ 'జన జాతర' ఎన్నికల ప్రచార బహిరంగసభలలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. దేవుడు గుడిలో ఉండాలి, భక్తి గుండెల్లో ఉండాలి కానీ, మోదీ దేవుడిని, భక్తిని ఓట్లుగా మార్చుకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా ఉన్న మోదీ మత విద్వేశాలు రెచ్చగొట్టేలా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల సంపదను ముస్లింలకు పంచి పెడతారని మాట్లాడటం ద్వారా మోదీకి ఓటమి భయం పట్టుకున్నట్లు అర్థమైందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని కాపాడాలంటే మళ్లీ కాంగ్రెస్ గెలవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన మొదలయిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న తమ ప్రభుత్వాన్ని కూలగొట్టేం దుకు ఢిల్లీలో ప్రధాని మోదీ, గల్లీలో కెసిఆర్ కలిసి కుట్రలు చేస్తున్నా రని సిఎం మరో సారి తరువాయి 8లో

## 25,753 మంది ఉద్యోగాలు రద్దు

**తీసుకున్న జీతం వడ్డీతో కట్టాలి**

**కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు**



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా హైకోర్టు డివిజన్ బెంచ్ సంచలన తీర్పు ఇచ్చింది. 2016లో జరిగిన 25,753 ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్ల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో రాష్ట్రస్థాయి ఎంపిక పరీక్ష రాసిన 23 లక్షల మంది అభ్యర్థుల ఒఎంఆర్ షీట్లను మళ్లీ మూల్యాంకనం చేయించాలని నిర్దేశించింది. అప్పట్లో అక్రమంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన 25,753 మంది కూడా ఇప్పటివరకు తీసుకున్న వేతనాలను 12 శాతం వడ్డీతో కలిపి తిరిగి ఇచ్చేయాలని తీర్పులో కోర్టు సూచించింది. 9, 10, 11, 12వ తరగతి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులను బోధించేందుకు 2016 సంవత్సరంలో తరువాయి 2లో



## సూరత్‌లో బిజెపి అభ్యర్థి ఏకగ్రీవం

**సూరత్:** గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గంలో బరిలో ఉన్న ఇతర అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో బిజెపి అభ్యర్థి ముఖేష్ దలాల్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అన్నికలు అధికారులు చెప్పారు. దలాల్‌కు ఎన్నికల సర్టిఫికెట్‌ను అందించినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సౌరభ్ పర్ధీ మీడియాకు వెల్లడించారు. మే 7వ తేదీన గుజరాత్‌లోని మొత్తం 26 తరువాయి 2లో

## కెటిఆర్‌కు 'గ్రేటర్' సవాల్



ఆ 'మూడు' నియోజకవర్గాలపై బిఆర్‌ఎస్ ఆశలు

గులాబీ నేతల్లో ఉత్కంఠ..

ప్రజాపక్షం/హైదరాబాద్

మాల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావుకు పెద్ద సవాలుగా మారనుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగే ప్రతి ఎన్నికల ఫలితాలు కెటిఆర్ ఖాతాలోనే పడ్డాయి. స్థానిక సంస్థల నుండి శాసనసభ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికను ఒక సవాలుగా తీసుకున్న కెటిఆర్‌కు, ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు పెద్ద 'అగ్ని పరీక్ష'గా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో "కారు" జోరు ఎలా ఉన్నప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎంపి స్థానాల్లో కారు జోరు ఎలా ఉంటుందనేది బిఆర్‌ఎస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. చేవేళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాల్లో బిఆర్‌ఎస్ విజయవకాశాలు ఎలా ఉంటాయి?, ఈ నియోజకవర్గాల్లో కెటిఆర్ పాత్రపై సర్వత్రా ఆసక్తి మారింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాల్లో బిఆర్‌ఎస్ ఎన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందనే అంశంలో ఆ పార్టీ స్పష్టత ఇవ్వకపోయినా గ్రేటర్ హైదరాబాద్‌పైన గంపెడాశలు పెట్టుకున్నది. ఇక్కడ తమకు గెలిచిన ఎంఎల్‌ఎలు, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు సక్రమంగా, తరువాయి 2లో



## కవిత బెయిల్‌పై తీర్పు మే 2కు వాయిదా

**న్యూఢిల్లీ :** మద్యం అవినీతి కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుమార్తె కె.కవితకు బెయిలు మంజూరు చేయడంపై కేసు విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత సిబిఐ-ఇడి దర్యాప్తు సంస్థల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సోమవారం ఈ అంశంపై తీర్పును వెల్లడించకుండా మే 2వ తేదీకి వాయిదా వేసింది. తీర్పును తనవద్దనే ఉంచుకుంది. మద్యం వ్యాపారులకు మేలు చేయాలని కోరుతూ భారత రాష్ట్రసమితి తరువాయి 2లో

## 66వేల మంది భారతీయులకు అమెరికా సిటిజన్‌షిప్

జాబితాలో రెండో దేశంగా ఇండియా




**వాషింగ్టన్:** అమెరికాలో స్థిరపడిన భారతీయులు అత్యధిక సంఖ్యలో అక్కడి పౌరసత్వం పొందారు. 2022లో సహజీకృత పౌరసత్వం కింద సుమారు 66,000 మంది అగ్రరాజ్య పౌరులయ్యారు. ఈ పద్ధతిలో అమెరికా పౌరులుగా మారిన జాబితాలో 1,28,878మంది పౌరులతో మెక్సికో మొదటి స్థానంలో నిలించింది. ఆ తర్వాత 65,960 మంది భారతీయు లు అమెరికా సహజీకృత సిటిజన్‌షిప్ లభించింది. అగ్రరాజ్యంలో 2022 నాటికి 4.6 కోట్ల మంది విదేశీయులు నివసిస్తున్నారు. 33.3 కోట్ల యుఎస్ జనాభాలో ఇది 14 శాతానికి సమానం. వీరిలో 2.45 కోట్ల మంది తమని తాము సహజీకృత పౌరులుగా పేర్కొన్నారు. మొత్తంగా 2022లో 9,69,380 మంది ఈ పద్ధతి ద్వారా అమెరికా పౌరులుగా మారారని ఇండిపెండెంట్ 'కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్‌ఎస్)' నివేదిక తెలిపింది. అదే ఏడాదిలో 1,28,878 మంది మెక్సికన్లు అమెరికన్ పౌరులుగా తరువాయి 8లో

ప్రపంచం

## ఇక గెలిచే అవకాశం మాకే

### జెలెన్స్కీ కేరింత



**కీవ్ :** రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఇక గెలుపు అవకాశం తమదేనని ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ కేరింతలు కొడుతున్నారు. పనిలో పనిగా అమెరికా దిగువసభకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎగువసభ సెనేట్ వీలైనంత తొందరగా తమకు 60 బిలియన్ డాలర్ల సహాయాన్ని క్లియర్ చేసే పని పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉక్రేన్‌కు సరఫరా చేయవలసిన అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థను కూడా సత్వరం తమకు సమకూర్చాలని ఆయన కోరారు. తమకు లాంగ్ రేంజ్ వెపన్స్ సమకూర్చాలని కోరారు. అమెరికా ప్రతినిధుల సభ నిర్ణయాలకు, ఆచరణకూ మధ్య జాప్యం లేకుండా సత్వరం అన్నీ తమకు సమకూరిస్తే గెలుపు అవకాశాలు తమకే ఉంటాయన్నారు. కాగా కీవ్‌లో ఆర్టిల్లరీ సోల్జర్లు ఈ సందర్భంగా సంబరాలు చేశారు. ‘‘మా బలం పెరుగుతుంది, రక్షణ పెరుగుతుంది, డ్రోన్లతో సహా కావాల్సినన్ని ఆయుధాలు తమకు అందుబాటులోకి వస్తాయి’’ అని ఆర్టిల్లరీ సోల్జర్ వరకూ సంతోషం వ్యక్తం చేశారు. కాగా జర్మల్ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ మాట్లాడుతూ, భవిష్యత్ కోసం అమెరికా ఎంతో గొప్ప ఆలోచన చేసిందని వ్యాఖ్యానించారు. సెనేట్ కూడా త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా తూర్పు ఉక్రేన్‌లో నోవో మిఖైలివ్‌కా గ్రామాన్ని తమ సైన్యం స్వాధీనం చేసుకుందని రష్యా రక్షణశాఖ సోమవారం ప్రటించింది. ఉగ్లెడార్‌కు 20 కి.మీ దూరంలో ఈ గ్రామం ఉంది. పూర్తిగా ఈ గ్రామాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నట్లు పేర్కొంది. సరిహద్దుల్లో పరిస్థితులు అంతకంతకూ క్షీణిస్తున్నాయనీ, తక్షణం అమెరికా సహాయం కావాలనీ ఉక్రేన్ వారం క్రితమే ప్రకటించిన పూర్వరంగంలో రష్యా రక్షణశాఖ ఈ విషయం వెల్లడించింది.

## ఇజ్రాయిల్ ప్రధాని–రక్షణమంత్రి మధ్య విభేదాలు

### ఇంటెలిజన్స్ చీఫ్ హలివా రాజీనామా





**టెల్ అవీవ్ :** యుద్ధ సమాచారం, జాతీయ భద్రతాంశాలపై ఇజ్రాయిల్ మంత్రివర్గంలో విభేదాలు వచ్చాయి. మంత్రివర్గంలో చర్చించుకున్న సమాచారం బయటకు పొక్కుతోందన్న విషయంపై ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ, రక్షణమంత్రి యోవ్ గాల్లంట్ మధ్య విభేదాలు తలెత్తాయి. అదేవిధంగా రక్షణమంత్రి గాల్లంట్ మంత్రివర్గంలో సీనియర్, మాజీ రక్షణ అధికారి బెన్నీ గాంట్స్ మధ్య కూడా మాటలయుద్ధం నడుస్తున్నది. గాల్లంట్ ఎప్పుడు మంత్రివర్గ సమావేశానికి వచ్చినా ఆ సమాచారం బయటకు పొక్కుతోందని నేతన్యాహు మండిపడుతున్నారు. బెన్నీ కూడా గాల్లంట్‌పై మండిపడుతున్నారు. మరోవైపు ఇజ్రాయిల్ పోలీస్, సైన్యం పైన కూడాఆంక్షలు పెట్టాలన్న అమెరికా ఆలోచనలపై కూడా మంత్రివర్గం మల్లల్లాలు పడుతున్నది. జాతీయ భద్రతకు నువ్వు నష్టం చేస్తున్నావంటే, నువ్వే నష్టం చేస్తున్నావంటూ మంత్రివర్గంలో ఒకరనొకరు దూషించుకునే పరిస్థితులు తలెత్తాయి. అదే విధంగా ఇజ్రాయిల్ ఆర్మీ ఇంటెలిజన్స్ విభాగం ప్రధానాధిపతి అహరోన్ హాలీవా తన పదవికి రాజీనామా చేశారు. ఆర్మీ ఇంటిలిజెన్స్‌కు కొత్త చీఫ్‌ను ఎంపిక చేశాక ఆయన పూర్తిగా బాధ్యతల నుండి వైదొలగుతారని చెప్పారు. గత ఏడాది అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయిల్‌పై దాడి చేసి 1,139మందిని హతమార్చారు. వివిధ దేశాలకు చెందిన మరో 240 మందిని బందీలుగా తీసుకుపోయారు. హమాస్ ఉగ్రవాదులు దాడులు చేస్తారన్న విషయం ముంగానే పసిగట్టడంలో జరిగిన వైఫల్యాన్ని బాధ్యత వహిస్తూ అహసన్ సోమవారం రాజీనామా చేశారు. హమాస్ మెరుపు దాడిని గ్రహించడంలో ఆయన విఫలమయ్యారని విమర్శలు వచ్చాయి. ఈ ఘటన జరిగిన ఆరునెలల తర్వాత ఇజ్రాయిల్ మంత్రివర్గంలో ఒకవైపు విభేదాలు తలెత్తడం, మరోవైపు అహసన్ రాజీనామా పరిణామాలు పశ్చిమాసియాలో ప్రభావం చూపించే అవకాశాలు ఉంటాయి. ఖాన్‌యూనిస్ లోని నసీర్ ఆసుపత్రి నుండి ఇజ్రాయిల్ సైన్యం ఉపసంహరించుకున్న తర్వాత సామూహికంగా ఖననం చేసిన సమాధుల నుండి 283 మృతదేహాలు బయటపడ్డాయని పౌర రక్షణ దళాలు తాజా సమాచారం తెలియజేశాయి. ఎవరికీ తెలియకుండా ఈ మృతదేహాలను ఖననం చేశారు. కాగా ఇప్పటివరకూ ఇజ్రాయిల్ దాడుల్లో 34,097 మంది పాలస్తీనియన్లు మరణించగా, 76,980 మంది గాయపడ్డారు. తాజాగా సోమవారం కూడా ఇజ్రాయిల్ దాడులు కొనసాగాయి.

## అక్రమ వలసలపై బ్రిటన్‌లో రాజకీయ ప్రతిష్టంభన




**లండన్ :** రువాండా నుండి బ్రిటన్‌కు అక్రమ వలసలు అరిట్టేందుకు, వచ్చిన వారిని సగౌరవంగా తిరిగి ఆదేశంలో వదిలలేసేందుకు సంబంధించిన బిల్లుపై ప్రధానమంత్రి రిషి సునాక్ తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు. ఈ బిల్లు విషయంలో బ్రిటన్‌లో రాజకీయ ప్రతిష్టంభన కొనసాగుతున్నది. నాలుగు నెలలుగా ఈ బిల్లుపై ఎగతెగని వివాదం జరుగుతున్నది. నెల 18వ తేదీన బిల్లు ఆమోదం పొందకుండా హౌస్ ఆఫ్ లార్డ్స్ అడ్డుకున్నది. అదేవిధంగా ఆఫ్ఘనిస్థాన్ నుండి వచ్చిన ఆశ్రితులకు మినహాయింపులు ఉండాలని కూడా వారు కోరుతున్నారు. బ్రిటన్‌కు 6,500 కి.మీ దూరంలో ఉన్న సెంట్రల్ ఆఫ్రికా దేశం రువాండా నుండి బాధితులు ప్రాణాలు కూడా లెక్కచేయకుండా చిన్న చిన్న బోట్లలో ఇంగ్లీష్ ఛానల్ దాటి వచ్చి బ్రిటన్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంలో 2022 జనవరి 1వ తేదీ తర్వాత దేశంలోకి వచ్చిన వలస ప్రజలను వెనక్కు విమానాల్లో పంపిచే బిల్లు అత్యవసరమైనదని రిషి సునాక్ వాదిస్తుండగా ఈ బిల్లులో సవరణలు చేయాలని హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యులు వాదిస్తున్నారు. ఈ బిల్లును ఆమోదించడం అత్యవసరమని సునాక్ మొత్తుకుంటున్నారు. చిన్న చిన్న బోట్లలలో అక్రమంగా వేలాదిమంది దేశంలోకి వస్తున్నారని, వీరిని అడ్డుకోవాలని ఆయన అన్నారు. దీనిపై నాలుగు నెలలుగా రగడ జరుగుతున్నది. ఈ బిల్లు మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నదని అత్యున్నత న్యాయస్థానం విమర్శించింది. ఇప్పటివరకూ ఆశ్రయం కోరి వచ్చిన వారిని తిరిగి రువాండాకు పంపలేదని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. రువాండా నుండి న్యాయబద్ధంగా వచ్చేసినవారిని తిరిగి బలవంతంగా ఆ దేశానికి పంపేస్తే వారు తీవ్ర సమస్యల్లో పడతారని, వారు హింస, అణచివేతలకు గురి కావచ్చుననీ అత్యున్నత న్యాయస్థానం చెబుతున్నది. 2022 జూన్‌లోనే మొదటి విమానం రువాండా వలస ప్రజలను తిరిగి ఆ దేశంలో దిగబెట్టేందుకు బయలుదేరాల్సి ఉండగా, న్యాయపరమైన చిక్కులు, సవాళ్ళు ఎదురుకావడంతో ఇప్పటివరకూ ఒక్క విమానం కూడా ఆ దేశానికి బయలుదేరలేదు. ఈ విధంగా ఇప్పటివరకూ 50,000 వేలమంది బ్రిటన్‌కు వచ్చారు. 2024లో మరో నాలుగువేల మంది వచ్చారు.

### వివాదాస్పద ఎంపి మెంజియస్ రాజీనామా



బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీ ఫ్లయిడ్ నియోజకవర్గ ఎంపి మార్క్ మెంజియస్ రాజీనామా చేశారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కన్జర్వేటివ్ పార్టీ గతవారం ఆయనను సస్పెండ్ చేసింది. నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు జరపాలని ప్రతిపక్ష లేబర్ పార్టీ కూడా డిమాండ్ చేస్తున్నది. పార్లమెంటు సభ్యుడి స్థాయిని దిగజార్చేవిధంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ మార్క్ మెంజియస్‌ను పార్టీ సస్పెండ్ చేసింది. కాగా ఇంటా బయటా తనపై ఒత్తిడి పెరిగిందనీ, తన పెద్ద చేస్తున్న ఒత్తిడి కారణంగా కుటుంబ వ్యక్తిగత జీవితానికి విలువ ఇచ్చి రాజీనామా చేస్తున్నాననీ, తదుపరి తాను ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తే లేదని మెయింజిస్ ఒక ప్రకటనలో చెప్పారు. పార్టీ నిధులను ఆయన అనర్హులకు ఇచ్చారని కూడా మార్క్ మెంజియస్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆరోపణలు వచ్చిన తర్వాత పార్టీ కార్యకర్త ఒకరికి తెల్లవారుజామునే ఫోన్ చేసి ఐదువేల పౌండ్లు అడిగారని కూడా ఆరోపణలు వచ్చాయి. 14 వేల పౌండ్లు పార్టీ నిధులను మెడికల్ బిల్లుల కింద ఖర్చు చేశారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. కుటుంబ జీవితానికి గౌరవం ఇచ్చి తాను వైదొలగుతున్నానని మెంజియస్ అన్నారు.

## చైనా రెండు రాష్ట్రాలలో వరద బీభత్సం

### 11 మంది గల్లంతు

**బీజింగ్ :** చైనాలో ఈనెలారంభం నుండి వరద బీభత్సం కొనసాగుతున్నది. ఈ వరదలు చరిత్ర సృష్టిస్తున్నాయి. తాజాగా గాంగ్ డాంగ్, గుయిఝూవు రాష్ట్రాలు వరదల కారణంగా నీట మునిగాయి. 11 మంది గల్లంతయ్యారు. ఈనెల 8 వ తేదీన ప్రారంభమైన భారీ వర్షాలు వరదలు 16వ తేదీన నాటికి ఉద్ధృత రూపం దాల్చాయి. దేశవ్యాప్తంగా 44 నదులు పొంగిపొర్లుతున్నాయి. షిజియావో హైడ్రొలాజికల్ స్టేషన్ వద్ద బీజింగ్ వరదనీరు సగటున సెకనుకు 12,000 క్యుబిక్ మీటర్ల వంతున నీటి పరిమాణం పెరిగింది. శతాబ్దంలో మొదటిసారి బీజింగ్ నది తన ఉగ్రరూపం ప్రదర్శించిందని అధికారులు చెప్పారు. కరకట్టలు తెగుతూ ఉండటంతో చైనా పారిశ్రామిక ప్రాంతం గాంగ్‌డాంగ్ వరదబారిన పడింది. రాష్ట్రంలో వేలాది గ్రామాలకు ప్రధా ప్రాంతాలలో రహదారి



సంబంధాలు తెగిపోయాయి. 10 లక్షలమంది ప్రజలు విద్యుత్ లేకుండా గడుపుతున్నారు. దీంతో ప్రభుత్వం వరదల నుండి దేశవ్యాప్తంగా 12.70 కోట్ల మంది ప్రజలకు సురక్షిత జీవనం కలిగించేందుకు ఒక సుదీర్ఘ ప్రణాళికా రచన చేసింది. తాత్కాలికంగా డ్యామ్‌లు మూసివేశారు. 1998 నుండి చైనాలో నదులు రికార్డుస్థాయిలో ఉప్పొంగుతున్నాయి.

### ఎర్త్ డే చైతన్యం రావాలి

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న తరుణంలో ఏప్రిల్ 22న జరిగిన ఎర్త్ డే కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా మారిపోయిన వాతావరణ పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా ప్రతి మనిషీ భూమిని రక్షించుకునే ప్రయత్నం చేయాలనేదే ఎర్త్ డే లక్ష్యం. అమెరికా సెనేటర్, పర్యావరణవేత్త గేలార్డ్ నెల్సన్, హార్వర్డ్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ విద్యార్థి డేనిస్ హాయేస్ ఇద్దరూ కలిసి 1970లో ఎర్త్ డేకు శ్రీకారం చుట్టారు. అప్పటినుండీ ప్రతి ఏడాదీ ఈ ఎర్త్ డే పాటిస్తున్నారు. మొదటిసార ఎర్త్ డే జరిగినప్పుడు చైతన్యం వెల్లి విరిసింది. అమెరికా వ్యాప్తంగా రెండు కోట్లమంది ప్రజలు అనేక రాష్ట్రాలలో వీధుల్లోకి వచ్చి ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత 1990లో ఇది ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలలో పాటించేవిధంగా ప్రపంచ కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. సముద్రంలో ప్రతి ఏటా 92 మిలియన్ టన్నుల టెక్స్‌టైల్స్ వ్యర్థాలు, మరో 10 లక్షల ప్లాస్టిక్ వ్యర్థాలూ కలిసిపోతున్నాయని పర్యావరణ, వాతావరణవేత్తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## భారత్ వ్యతిరేకతకే మాల్దీవుల ఓటు



**మాలె :** మాల్దీవుల ప్రజలు భారత్ వ్యతిరేకతకే ఓటు వేశారు. మాల్దీవులలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో చైనా అనుకూల మహ్మద్ మొయిజ్జు భారత్ వ్యతిరేకతే ప్రధాన నినాదంగా ప్రచారం చేశారు. అందుకు అనుగుణంగానే మాల్దావుల నేషనల్ కాంగ్రెస్‌పార్టీకి పార్లమెంటులో సూపర్ మెజారిటీ వచ్చింది. పార్లమెంటు మజ్లిస్‌లో ఉన్న 93 సీట్లకు గాను మొయిజ్జుకు చెందిన నేషలిస్ట్ పార్టీకి 60 సీట్లు లభించాయి. అదేవిధంగా ఆయన పార్టీ మద్దతుతో ఇండిపెండెంట్లు కూడా మరో ఆరుగురు గెలిచారు. ప్రతిపక్ష మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ కూడా ఎన్నికల్లో మొయిజ్జుకు వ్యతికంగా ఎంతో కష్టపడి భారీ ప్రచారం చేసినప్పటికీ ఆయనవైపే ప్రజలు మొగ్గుచూపారు. మాల్దీవుల సార్వభౌమాధికారాన్ని భారత్ నుండి రక్షించాలని మొయిజ్జు ప్రజల్లో విస్తారంగా ప్రచారం చేశారు. భారత సైన్యాన్ని మాల్దావుల నుండి వెళ్ళగొట్టాలని ఆయన ప్రతి సభలోనూ ప్రజలకు చెబుతూ వచ్చారు.

## ఓటమి భయంతోనే మోదీ వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు గెలుపొందితే, హిందువుల ఆస్తులను, ఆడవారి మెడలో మంగళసూత్రాలను లాగేసుకుని, ముస్లింలకు, చొరబాటుదారులకు పంచుతారని ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వ్యాఖ్యలను కూనంనేని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్, వామపక్షాల కబంధ హస్తాలలో చిక్కుకున్నదని, ఆ పార్టీ మ్యానిఫెస్టో ఆందోళనకరంగా ఉన్నదని మోదీ అనడాన్ని తప్పుబట్టారు. ప్రధాని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శమన్నారు. పదేళ్ళ మోదీ పాలనలో ప్రజల కోసం చేసిందేమీ లేదని, నిత్యావసర ధరలు, నిరుద్యోగం, పెట్రోలు, డీజిల్ రికార్డు స్థాయిలో పెరిగిపోయాయని, ప్రజల సమస్యలను పక్కదారి పట్టించేందుకే మతం పేరుతో మభ్యపెట్టడం బిజెపికి, మోదీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. ఇవన్నీ గమనించిన ప్రజలు లోక్‌సభ తొలి విడత ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేశారనే సంకేతాలు రావడంతో ప్రధాని మోదీకి భయం పట్టుకున్నదని పేర్కొన్నారు. మోదీ ప్రధాని స్థాయిని దిగజార్చే వ్యాఖ్యలు చేస్తున్నారని కూనంనేని సాంబశివ రావు మండిపడ్డారు. ప్రజలందరినీ సమానంగా చూడాల్సిన ప్రధాని ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడడం ద్వారా వైషమ్యాలను రాజేస్తున్నారని, ఇది స్పష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకమన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం ప్రధాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కూనంనేని డిమాండ్ చేశారు.

## మే 2కు వాయిదా (మొదటి పేజీ తరువాయి)

నాయకురాలు, తెలంగాణలో శాసనమండలి సభ్యురాలు కవిత ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పార్టీకి సౌత్ గ్రూప్ తరపున రూ.100 కోట్లు ముడుపులు ఇచ్చారన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. తర్వాత సిబిఐ కూడా ఆమెను అరెస్టు చేసింది. ఆప్ ప్రభుత్వం రూపొందించిన ఎక్సైజు విధానం మద్య వ్యాపారుకు మేలు చేసేదిగా ఉందన్న విషయంపై సిబిఐ దర్యాప్తు చేస్తున్నది. ఆర్థిక అక్రమాలు చేయదంకోసమే ఈ విధానం రూపొందించారని ఇడి, సిబిఐలు ఆరోపిస్తున్నాయి. ఇదే విషయంపై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై వాదోపవాదాలను కోర్టు కొనసాగించింది.

## బిజెపి అభ్యర్థి ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. అయితే అంతకు ముందే సూరత్‌లో ఫలితం వెలువడడం గమనార్హం. ఇక మిగతా 25 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సూరత్ నుంచి నలుగురు స్వతంత్రులు, ముగ్గురు చిన్న పార్టీల అభ్యర్థులు, బిఎస్‌పి నుంచి ఒక అభ్యర్థి మొత్తం 8 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి నిలేశ్ కంభాని నామినేషన్‌ను శనివారం జిల్లా రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. నామపత్రాల్లో ప్రతిపాదితుల సంతకాలు లేవనే నెపంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేష్ పడ్సాలా నామినేషన్ చెల్లకుండా పోయింది. ఈ నేపథ్యంలో బిజెపి కనుసన్నల్లోనే కుంభాని నామినేషన్‌ను తిరస్కరించారని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

## ‘సుప్రీం’ అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) 1971చట్టాన్ని అనుసరించి, వైద్యుడి సలహా మేరకు 12 వారాల గర్భ విచ్ఛితికి అనుమతి ఉంది. ఇద్దరు వైద్యులు సూచిస్తే, 20 వారాల గర్భాన్ని కూడా తీసివేయవచ్చు. అయితే, ఈ కేసులో బాధిత బాలిక 30 వారాల గర్భవతి కావడంతో, అబార్షన్ సాధ్యమా? ఆమె ప్రాణానికి ప్రమాదమా? అనే అనుమానాలు తలెత్తాయి. ఫలితంగా ఈ కేసుపై విస్తృత పరిధిలో చర్చనీయాంశమైంది. అబార్షన్‌కు సుప్రీం కోర్టు అనుమతించడంతో ఉత్కంఠకు తెరపడింది.

## నీటి సరఫరాలో అంతరాయం కలగొద్దు : సిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీటి సరఫరాలో అంతరాయాలు రాకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా తాగు నీటి కృత్రిమ కొరతను సృష్టించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే నెల రోజుల పాటు రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితిని నిషితంగా పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్, నీటిపారుదల, పంచాయితీ రాజ్ శాఖల అధికారులతో హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శాంతికుమారి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించారు. సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాలను గుర్తించి,ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో నీటి పరిస్థితిని ప్రస్తావిస్తూ సంబంధిత సిజిఎం ముందస్తు అనుమతితో మాత్రమే నిర్వహణ పనులు చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. సిజిఎంలు ప్రతిరోజూ తమ పరిధిలోని మేనేజర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నాగార్జునసాగర్ నుంచి నీటి పంపింగ్ ఇప్పటికే ప్రారంభమైందని, మే నెలాఖరు వరకు రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి లోటు ఉండదని అధికారులు తెలిపారు. సిడిఎంఎ దివ్య మాట్లాడుతూ మంచినీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నామని, లీకేజీలు ఏవైనా ఉంటే వెంటనే సరిచేస్తున్నామని వివరించారు. ప్రతి మున్సిపాలిటీలో హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేశామని, నీటి సరఫరాలో చిన్న అంతరాయం ఏర్పడినా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సమీక్షలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఎండి హెచ్‌ఎండబ్ల్యూఎస్బీ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ అదే పాట (మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ప్రచారంలో మోదీ పాల్గొన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు సంతుష్టీకరణ విధానాలను అవలంభిస్తున్నారని, అయినప్పటికీ ఆ వర్గం సామాజిక ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఏమీ చేయలేదని ఆయన అన్నారు. అందుకు భిన్నంగా తమ ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్ వ్యతిరేకంగా చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష ఇండియాకూటమి ఉద్దేశ్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఎవరెంత సంపాదిస్తున్నారు, వారికి ఎన్ని ఆస్తులు ఉన్నాయనే అంశంపై విచారణ చేయిస్తామని కాంగ్రె స్ యువరాజు అంటున్నారని, అంతే కాకుండా ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం పునఃపంపిణీ చేస్తుందంటున్నాడని, ఇదే వారి మ్యానిఫెస్టోలో ఉన్నదన్నారు. మన తల్లులు, ఆడపిల్లల దగ్గర బంగారం ఉంటుందని, ఆ బంగారాన్ని కొట్టేసేందుకు వారి కన్ను పడిందని ప్రతిపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. వేతనజీవుల ఆస్తుల గురించి సర్వే చేసేందుకు ప్రతిపక్షాలు ప్రణాళిక వేశాయని, మీకు రెండు ఇళ్ళులు ఉంటే ఒకటి గుంజుకుంటారని, కాంగ్రెస్ ఆ స్థాయికి కూడా వెళ్తుందని అన్నారు. ఇది మావోయిస్టుల ఆలోచన అని, ఇది కమ్యూనిస్టుల ఆలోచన అని , అలా చేయడం ద్వారా ఇప్పటికే అనేక దేశాలు దెబ్బతిన్నాయన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి ఇదే విధానాన్ని అమలు చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. అయితే రాజస్థాన్‌లో ప్రసంగం మాదిరిగా కాకుండా అలీగఢ్‌లో ఒక అడుగు వెనక్కి వేసి ముస్లింలు అనే పదాన్ని ప్రధాని మోదీ తన ప్రసంగంలో వాడలేదు.

## ఉద్యోగాలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

గ్రూప్ సి, గ్రూప్ డి కేటగిరీల పోస్టులను బంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ భర్తీ చేసింది. మళ్లీ కొత్తగా ఆయా పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను మొదలుపెట్టాలని, 15 రోజుల్లోగా నియామక ప్రణాళికను సిద్ధం చేయాలని బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. దీనిపై సిబిఐ దర్యాప్తు కొనసాగించవచ్చని, ఈ కేసులో ఎవరినైనా కస్టడీలోకి తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది. దీంతో ఎన్నికల వేళ మమతా బెనర్జీ ప్రభుత్వానికి పెద్ద షాక్ తగిలినట్లయింది.

### ఉద్యోగాల రద్దు చట్టవిరుద్ధం : దీదీ

బంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న సిఎం మమతా బెనర్జీ, కోల్‌కతా హైకోర్టు తీర్పుపై ఘాటుగా స్పందించారు. ఏకంగా 25,753 మంది ఉద్యోగాలను రద్దు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ తీర్పును ఎగువ న్యాయస్థానంలో సవాల్ చేస్తామని వెల్లడించారు. న్యాయవ్యవస్థను, తీర్పులను బిజెపి నాయకులు ప్రభావితం చేస్తున్నారని దీదీ ఆరోపించారు. 2016లో ఉద్యోగాల్లో భర్తీ అయిన వారంతా గత 8 ఏళ్ల వేతనాన్ని 4 వారాల్లో చెల్లించడం ఎలా సాధ్యమవుతుందని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. వారందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

## కెటిఆర్‌కు ‘గ్రేటర్’ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయంతో పనిచేస్తే ఒక్క స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు మరో స్థానంలో బలమైన పోటీ ఇచ్చే అవకాశాలు ఉంటాయని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. గత సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 42.05 శాతం, బిఆర్‌ఎస్‌కు 35.26 శాతం, కాంగ్రెస్‌కు 18.93 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలుపొందింది. అయితే ప్రస్తుతం సిట్టింగ్ ఎంపి జి. కిషన్‌రెడ్డి, బిఆర్‌ఎస్ నుండి ఖైరతాబాద్ ఎంఎల్‌ఏగా గెలుపొందిన దానంనాగేందర్ కాంగ్రెస్ తరపున పోటీలో ఉన్నారు. బిఆర్‌ఎస్ తరపున సికింద్రాబాద్ ఎంఎల్‌ఎ పద్మారావు గౌడ్ పోటీలో ఉన్నారు. అలాగే మేడ్చల్ కాంగ్రెస్ ఎంపిగా ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి 38.63 శాతం ఓట్లు పోలవ్వగా, ద్వితీయ స్థానంలో బిఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డికి 37.93 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్కాజిగిరి ఎంఎల్‌ఏగా ఉండగా, బిఆర్‌ఎస్ ఎంపిగా రాగిడి లక్ష్మారెడ్డి పోటీలో ఉన్నారు. చేవేళ్లలో బిఆర్‌ఎస్‌కు 40.62 శాతం, ద్వితీయ స్థానంలో నాడు కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 39.5 శాతం ఓట్లు వచ్చాయి. అయితే ఈసారి జరిగే ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ తరపున, గతంలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి బిజెపి తరపున పోటీ చేయగా, బిఆర్‌ఎస్ తరపున కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీలో ఉన్నారు.

### ఎంపి అభ్యర్థులకు ‘గ్రేటర్ నేతలు’ సహకరించేనా..?

బిఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థులకు స్థానిక గులాబీ నేతలు, ప్రజాప్రతినిధుల నుండి ఎంత వరకు సహకారం లభిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే గ్రేటర్ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైన రాజేంద్రనగర్ ఎంఎల్‌ఎ ప్రకాష్‌గౌడ్ కూడా చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ప్రకాష్‌గౌడ్ బిఆర్‌ఎస్‌ను వీడుతున్నారనే సమాచారం అందగానే కెటిఆర్ తక్షణమే రంగంలోనికి దిగి ఆయనను బుజ్జగించినట్టు తెలిసింది. ఇప్పటికే దానం పార్టీని వీడగా, మరో ఎంఎల్ఎ ప్రకాష్‌గౌడ్ కూడా వెళ్తే ఆ ప్రభావం లోక్‌సభ ఎన్నికల్లో తీవ్రంగా ఉంటుందని బిఆర్‌ఎస్ నేతలు అంచనా వేశారు. మొత్తానికి ప్రకాష్‌గౌడ్‌ను పార్టీ వీడకుండా ఆపగలిగారు. మరి కొందరు ముఖ్యనేతలు, ఒకరిద్దరు ఎంఎల్‌ఎలు కూడా బిఆర్‌ఎస్‌ను వీడుతారని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనిని ఆ పార్టీ నేతలు కొట్టిపారేస్తున్నప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం కొందరు ముఖ్యనేతలు అసంతృప్తిగానే ఉన్నట్టు తెలుస్తోంది. తాజా రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్న మరి కొందరు నాయకులు వేచిచూసే ధోరణిలో కనిపిస్తున్నారు. అప్పటి రాజకీయ పరిస్థితలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని వారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో ‘గ్రేటర్ రాజకీయం’పై కెటిఆర్ మార్క్ ఎలా ఉంటుందనేది ఆ పార్టీ వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఇది వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో అన్నీ తానై నడిపించి, వరుస విజయాలను తన ఖాతాలో వేసుకున్న కెటిఆర్, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎంతవరకు సఫలీకృతమవుతారనేది జూన్ 4న తేలనుంది.

## విద్వేష ప్రసంగాలు

(మొదటి పేజీ తరువాయి)

కట్టుబడి ఉండాలని ఖర్గే అన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని, అదే లక్ష్యంతో లోక్‌సభలో బిజెపి 400 సీట్లు గెలవాలని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు.

### ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

రాజస్తాన్‌లో జరిగిన ప్రచార సభలో ఒక మతాన్ని లక్ష్యంగా చేస్తూ విభజన పూరిత, ద్వేషపూరిత ప్రసంగం చేసిన ప్రధాని నరేంద్ర మోదీపై చర్య తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌ను సోమవారం నాడు కాంగ్రెస్ నాయకుల అభిషేక్ మనుసింఘ్వి, గురుదీప్ సప్పల్, సుప్రియా శ్రీనాతేలతో కూడిన ప్రతినిధి బృందం కలిసి ప్రధానిపై ఫిర్యాదు చేసింది . అలాగే బిజెపికి వ్యతిరకంగా 16 ఫిర్యాదులతో కూడిన వినతిపత్రాలను ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ప్రతినిధి బృందం సమర్పించింది. ప్రధాని ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించారని ఇసికి తెలియజేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బాహాటంగా ఉల్లంఘించినందుకు ప్రధానిని జవాబుదారీ చేయాలని, అలాగే ఎన్నికల్లో ఆయన , ఆయన పార్టీ చేస్తున్న తప్పులను పరిశీలించాలని కోరింది. ఈ అంశంలో ఎన్నికల సంఘం నిష్క్రియాపరత్వం , దాని ప్రతిష్ఠను కోల్పోయేలా చేస్తుందని, తక్షణమే అధికార పార్టీపై చర్య తీసుకోవాలని కోరింది. ప్రతిపక్షాలపై తప్పుడు, పరువునష్టం కలిగించేలా మోదీ ఆర్పోణలు చేస్తున్నారని, ఓట్ల కోసం మతాన్ని వాడుతున్నారని ఆరోపించింది. భారత స్వాతంత్ర సంగ్రామానికి నేతృత్వం వహించిన ప్రస్తుత ప్రధాన ప్రతిపక్షంమైన కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నట్లుగా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత యుజిసి నియామకాలు చేపట్టడంపై కూడా చర్యలు తీసుకోవాలని ఇసిని కాంగ్రెస్ కోరింది.

### మోదీకి మ్యానిఫెస్టోను ఖర్గే బోధిస్తారు: కె.సి.వేణుగోపాల్

కాంగ్రెస్ ఎన్నికల హామీ పత్రం గురించి బోధించేందుకు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్‌ను ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే కోరారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వెల్లడించారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో కాపీలను ప్రధాని మోదీకి దేశవ్యాప్తంగా కార్యకర్తలు, లోక్‌సభ అభ్యర్థులు పంపనున్నట్లు తెలిపారు. కొచ్చిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను ముస్లింలకు పునఃపంపిణీ చేస్తుందని వ్యాఖ్యలపై మోదీకి వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్‌కు లక్ష మంది సంతకాలతో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మోదీ వ్యాఖ్యలు ప్రధాని హోదాకు తగినవి కావని, ప్రధాని ప్రతి అంశంపై అబద్ధాలు చెబుతారని, బూటకపు వార్తలను ఎలా వ్యాప్తి చేస్తారని ప్రశ్నించారు. తమ మ్యానిఫెస్టోలో లేని అంశం గురించి ప్రధాని ప్రస్తావించి, ఎన్నికలలో లబ్ధి పొందేందుకు మతపరమైన విభజన సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

## సుప్రీం సూమోటోగా తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఘటనను సుప్రీంకోర్టు సూమోటోగా స్వీకరించి, విద్వేష ప్రసంగాలపై మోదీకి కోర్టు ధిక్కరణ నోటీసు ఇస్తుందని, కఠిన చర్యలు తీసుకుంటుందని ఏచూరి ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఇసికి ప్రజలు లేఖలు రాయాలి

మోదీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ప్రజలు లేఖలు రాయాలని తృణమూల్ కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యులు సాకేత్ గోఖలే విజ్ఞప్తి చేశారు. తన ‘ఎక్స్ ’ ఖాతాలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఈ మెయిల్ ఐడిని పోస్ట్ చేశారు. ప్రతిపక్షాల మాటను ఎన్నికల కమిషన్ ఖాతరు చేయడం లేదని, ఏమైనా చేసేందుకు మోదీకి,బిజెపికి ఫ్రీ పాస్ ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ జవాబుదారీ కాదని, కానీ,భారత ప్రజలకు జవాబుదారీ అని పేర్కొన్నారు. కాబట్టి మోదీ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలే ఎన్నికల కమిషన్‌కు తక్కువ పదాలతో ఈ మెయిల్ చేయాలని కోరారు.

ప్రజాపక్షం

మంగళవారం, ఏప్రిల్ 23

## ప్రధాని ఇంత దిగజారాలా?

రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు ఎన్నికల్లో పరస్పర ఆరోపణలు, నిందలు, దూషణలకు పాల్పడటం సహజం. కిందిస్థాయి నాయకుల వీధిభాషను పక్కనబెట్టినా ఉన్నత స్థాయి నాయకులనుంచి సంస్కారవంతమైన భాషను ఆశించుతాం. అయితే ప్రతిపక్షాలపై నిరంతరం నిందల నిప్పులు కురిపించే ప్రధాని నరేంద్రమోదీ మరీ సంయమనం కోల్పోయి ప్రదర్శిస్తున్న దిగజారుడుతనం, అబద్ధాల పరంపర అసహ్యంగా, జుగుప్సాకరంగా ఉంది. ఎన్నికల ఫలితాలపట్ల ఆయనలో ఏదో సందేహం పీడిస్తున్నట్లు భావించాల్సి వస్తోంది. అందుకే ఎన్నికల నమూనా ప్రవర్తనా నియమావళిని కూడా అతిక్రమించి రాజస్థాన్లో మొన్నొక ఎన్నికల సభలో కాంగ్రెస్ పార్టీపై పచ్చి అబద్ధాలు, వక్రీకరణలతో కూడిన నిందారోపణలు చేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తొలిదశ (ఏప్రిల్ 19)పై మోదీ పెట్టుకున్న అత్యాశలకు ఎదురుదెబ్బ తగిలిందన్న అంచనాల నేపథ్యంలో ఆయన రెచ్చిపోయినట్లున్నారు. ఓట్లవర్షం కురిపిస్తాడనుకున్న అయోధ్య బాలరాముడు భక్తజనులను విరివిగా ఆకర్షిస్తున్నప్పటికీ, ఆ భక్తిరసం అతిగా ఓట్లలోకి మారలేదన్న అంచనాలు బిజెపికి ఆందోళన కలిగిస్తున్నాయి. పోలింగ్ తక్కువశాతం నమోదుకాగా బిజెపికి బలమైన ప్రాంతాల్లో మరీ తక్కువగా పోలుకావటం, తమ విభజనవాద రాజకీయ ప్రచారం ప్రజలను ఉత్సాహపరచలేదన్న అనుమానం కలిగినట్లుంది. అందుకే అదనపు అబద్ధాల పదును జోడించారు ప్రధాని మోదీ.

28 ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుని, నియంతృత్వంనుండి దేశాన్ని కాపాడుకుందామని ప్రతిన బూనిన నాటినుండే బిజెపిలో కలవరపాటు ఆరంభమైంది. ఆ ప్రభావం ప్రజలకు చేరకుండా నిరోధించేందుకై 'ఇండియా' కూటమిని ఓ ప్రగతి నిరోధక, అవినీతికర, దేశ విచ్ఛిన్న కూటమిగా ప్రధాని ప్రభృతి నిందలు వేయసాగారు. ప్రజలెదుర్కొంటున్న నిత్యజీవిత సమస్యలు, నిరుద్యోగం, అధిక ధరలు వగైరాలను ఎన్నికల ఎజండాగా చర్చకు రానీయకుండా ఇతరేతర అంశాలవైపు దృష్టిమళ్లిస్తూ, తమకు అలవాటైన మత భావోద్రేకాల్లోకి ఓటర్లను నెట్టి పబ్బం గడుపుకునే ఎత్తుగడలు అనుసరిస్తున్నారు. నరేంద్రమోదీ తప్ప ఈ దేశానికి మరో మహా నాయకుడు లేనంతగా వ్యక్తిపూజ చేస్తూ, అన్నిచోట్ల ఆయనే అభ్యర్థిగా ఓట్లు అర్థిస్తున్నారు.

ఐదు న్యాయాల పేరుతో కాంగ్రెస్ పార్టీ కొత్తతరహా ఎన్నికల ప్రణాళిక ప్రకటించిన రోజే దానిపై ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్య ఆయనలోని అసహనాన్ని బయటపెట్టింది. కాంగ్రెస్ ప్రణాళికలోని "ప్రతి పేజీ భారతదేశాన్ని ముక్కలు చేయగోరుతున్నది. అది స్వాతంత్ర్య పోరాటకాలంలో ముస్లింలీగ్‌లో ఉన్న ఆలోచనను ప్రతిబింబిస్తున్నది. మిగిలిన భాగం వామపక్షాలు, 'అర్బన్ నక్సలైట్ల' భావాలతో నిండి ఉంది". జాతీయోద్యమకాలంలో ముస్లింలీగ్ ఆర్‌ఎస్‌ఎస్‌కు మంచి మిత్రుడన్న వాస్తవాన్ని కాంగ్రెస్ గుర్తుచేస్తూ, తమ ఎన్నికల ప్రణాళికపై ముస్లింలీగ్ ఆలోచన ముద్రవేస్తూ మోదీ చేసిన వ్యాఖ్యపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఆదివారంనాడు రాజస్థాన్‌లో గిరిజన మెజారిటీ ప్రాంతమైన భన్‌స్వారాలో ప్రధాని మోదీ ఎన్నికల ప్రసంగంలో హిందూ ఓట్లకై విద్వేషపూరితమైన ముస్లిం వ్యతిరేక ప్రసంగం చేశారు. దీనిపై కూడా ఇంకనూ ఎన్నికల కమిషన్ స్పందించలేదు. ప్రభుత్వంచే నియమించబడిన కమిషనర్‌లు తమ రాజ్యాంగ సంస్థ స్వతంత్రతను చాటిచెబుతారో, లేదో వేచిచూదాం.

ప్రధాని మోదీ గుజరాత్‌ను విడిచి భారతదేశ అధికార కేంద్ర స్థానంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా ఆయనలోని పచ్చి హిందూత్వవాది చెక్కుచెదరకుండా ఉన్నాడని ఆయన మొన్న రాజస్థాన్‌లో, సోమవారం అలీఘడ్‌లో చేసిన ప్రసంగాలు రుజువు చేస్తున్నాయి.

'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భారత ముస్లింలకు పంపిణీ చేయటానికి గిరిజనుల ఆస్తులు లాక్కొంటుంది' అన్నారు. ముస్లింలను 'చొరబాటుదారులు'గా, 'అధిక సంతానపరులు'గా ప్రస్తావించారు. తన వాదనకు బలం చేకూర్చేదిగా – ఎప్పుడో 2006లో నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ జాతీయాభివృద్ధి మండలిలో చేసిన ప్రసంగభాగాన్ని వక్రీకరించారు. కాంగ్రెస్ ప్రణాళికకు చేసిన వక్రభాష్యం ఇలా వుంది : 'మేము అధికారంలోకి వస్తే ప్రతి ఒక్క వ్యక్తి ఆస్తిని సర్వే చేస్తాం. మన సోదరీమణుల వద్ద ఉన్న బంగారం ఎంతో, ప్రభుత్వోద్యోగుల వద్ద ఉన్న ఆస్తులెంతో తనిఖీ చేస్తాం. మన సోదరీమణుల స్వర్ణాభరణాలను సమానంగా పంపిణీ చేస్తాం' అని చెప్పారంటూ 'మన ఆస్తిని తీసుకునే హక్కు ప్రభుత్వానికుందా?' అని మోదీ ప్రశ్నించారు. కాంగ్రెస్ హిందూ మహిళల 'మంగళసూత్రాలను' కూడా ముస్లింలకు పంపిణీ చేయవచ్చని మోదీ ఆరోపించారు.

తమ ప్రణాళికలో హిందూ–ముస్లింల ప్రస్తావన ఎక్కడుందో నిరూపించాలని కాంగ్రెస్ పార్టీ మోదీని సవాలు చేసింది. మన్మోహన్‌సింగ్ ప్రసంగానికి సంబంధించి, వనరుల పంపిణీలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆయన ఇలా వివరించారుః వ్యవసాయం, ఇరిగేషన్, జలవనరులు, ఆరోగ్యం, విద్య, గ్రామీణ మౌలిక వసతులపై ఇతోధిక పెట్టుబడి, సాధారణ మౌలిక వసతులపై ప్రభుత్వ పెట్టుబడుల అవసరం మన ఉమ్మడి ప్రాధాన్యతలని భావిస్తాను. వాటితోపాటు ఎస్‌సిలు/ఎస్‌టిలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, బాలల ఉద్ధరణ కార్యక్రమాలు ప్రాధాన్యం వహిస్తాయి. ఎస్‌సి, ఎస్‌టిల ఉపప్రణాళికలను పునరుత్తేజపరచాలి. అభివృద్ధి ఫలాల్లో మైనారిటీలకు, ముఖ్యంగా ముస్లింలకు సమాన వాటా లభించే సరికొత్త ప్రణాళికలు మనం రూపొందించాలి. వనరులపై తొలి క్లెయింవారిదే." ఈ చివరి మాట పైన ప్రస్తావించిన అన్ని తరగతులకు ఉద్దేశించింది కాగా, ప్రధాని మోదీ దాన్ని ముస్లింలకు మాత్రమే వర్తింపజేసి తన వక్రబుద్ధి బయటపెట్టారు. మోదీ ఈ తప్పుడు ఆరోపణను 2006లో చేసినప్పుడు ప్రధానమంత్రి కార్యాలయం దాన్ని "ఉద్దేశపూర్వకమైన, దుర్బుద్ధితో కూడిన తప్పుడు భాష్యంగా" ఖండించింది.

ఇద్దరు ప్రధానమంత్రుల మధ్య ఎంత తేడానో గమనించండి. ప్రతిపక్ష నాయకులకు తరచూ నోటీసులు పంపి సంజాయిషీ కోరే ఎన్నికల కమిషన్ మోదీ దుర్భాషలపై స్పందిస్తుందా? చర్య తీసుకుంటుందా?

## ఆర్ఎస్ఎస్–బిజెపి రాజ్ నుంచి

# దేశవిముక్తికి సిపిఐ పిలుపు



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

మన దేశానికి అత్యంత కీలకమైన సందర్భంలో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. మన రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మనుగడను మన దేశం ఏ విధంగా నిర్ణయిస్తుందన్న దానిపై ఎంతో ఆధారపడి ఉంది. పాలక భారతీయ జనతాపార్టీ సాధ్యమైన అన్ని మార్గాలు ఉపయోగించి దేశ ప్రజలపై వాగాడంబర, బోలు వాగ్దానాలు కుమ్మరిస్తున్నది. డబ్బు చేస్తున్న ఈ గోలలో అత్యంత ముఖ్యమైన అంశాలు కొన్ని మునిగిపోయే అవకాశముంది. గడచిన 10 సంవత్సరాలు ఏదైనా సూచన అయినట్లయితే, అధికారంలో బిజెపి కొనసాగటం మన రాజ్యాంగంలో పొందుపరిచిన ఉమ్మడి సంక్షేమం, సమానత, లౌకికతత్వం వంటి విలువలకు మరణశాసనం అవుతుంది. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోదీ ప్రభుత్వానిది ఘోరవైఫల్యం. ఆర్ఎస్ఎస్ ప్రోత్సహించిన ద్వేషం వల్ల మన సమాజానికి జరిగిన చేటు కూడా కనీవినీ ఎరుగనిది. మన ప్రజాస్వామ్యానికి, ఏ విలువలపై అయితే అది నిర్మాణం చేయబడిందో దానికి జరిగిన నష్టం కూడా అపారం. అయితే మోదీ దైవదూత పూర్వక నాయకత్వంలో భారతదేశం సూపర్ పవర్ అయిందని ప్రచారం చేయటానికి దూదూబసవన్న ప్రెస్, రాజీపడిన సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలను మనం ప్రజల దృష్టినుండి, ముఖ్యంగా అణగారిన తరగతుల దృష్టినుండి, బిజెపి పాలనలో ఆకలి, నిరుద్యోగం వంటి అతితీవ్రమైన సమస్యల దృష్టినుండి చూడాలి.

ప్రస్తుత రాజకీయ వాతావరణం 'మోదీగారి గ్యారెంటీలు' అనే

> మోదీ 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు కొన్నింటిని – ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు, మహిళలకు భద్రత, ప్రతి బ్యాంక్ ఖాతాలోకి రూ.15లక్షలు జమ వంటి సమస్యల గూర్చి బిజెపి నాయకులు ఇప్పుడు చర్చించటం కూడా లేదు. జవాబుదారీతనం లేని నాయకుడు ఇష్టానుసారం ప్రకటించిన డీమానిటైజేషన్ వంటి 'మాస్టర్ స్ట్రోక్' అనేది దృష్టి మళ్లింపు ఎత్తుగడలు, తలాడించే మీడియా సహాయంతో మరిచిపోవటం జరిగింది.

పదబంధంతో పూర్తిగా నిండిఉంది. గతంలో ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించటానికి సార్వత్రిక ఎన్నికలు ఒక సందర్భం. మోదీ గ్యారంటీలు ఓటు బ్యాంక్ రాజకీయాలు – పచ్చి అబద్ధాల మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు ప్రజలు చూస్తున్నారు. మోదీ 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు కొన్నింటిని – ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు, మహిళలకు భద్రత, ప్రతి బ్యాంక్ ఖాతాలోకి రూ.15లక్షలు జమ వంటి సమస్యల గూర్చి బిజెపి నాయకులు ఇప్పుడు చర్చించటం కూడా లేదు. జవాబుదారీతనం లేని నాయకుని ఇష్టానుసారం ప్రకటించిన డీమానిటైజేషన్ వంటి 'మాస్టర్ స్ట్రోక్' అనేది దృష్టి మళ్లింపు ఎత్తుగడలు, తలాడించే మీడియా సహాయంతో మరిచిపోవటం జరిగింది. ఈనాడు దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలనుండి దృష్టి మరల్చటానికి ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రచార వ్యవస్థ చేస్తున్న ప్రయత్నం సంభ్రమం గొలుపుతోంది. బిజెపి ప్రజలకు సేవచేసే బదులు వారిని దోచుకోవటంలో మునిగి ఉంది. మోదీ దుష్పరిపాలననుండి ప్రజలు బాధలు పడుతుండగా, ఆయన అందరికీ సౌభాగ్యం అనే తన వాగ్దానాలను తిరిగి విక్రయించే పనిలో ఉన్నారు. ఇదంతా 'వికసిత్ భారత్' అనే మంచు తెర వెనుక దాచబడుతున్నది. భారత్‌లో వాస్తవిక భాగస్వాములైన కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు ఒక పరిపూర్ణ దశాబ్దం పాటు అవకాశాలు కోల్పోయినందుకు విచారిస్తున్నారు.

ప్రధానమంత్రి మోదీ, ఆయన వందిమాగధులు ఐదు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అనే బోలు వాగ్దానాన్ని ఖాళీ డబ్బాలో గులకరాయిలా గలగలలాడిస్తున్నారు. ఆ ఆర్థిక వ్యవస్థ రూపం, స్వభావం గూర్చి వారెన్నడూ చర్చించరు. ఆ ఐదు ట్రిలియన్ డాలర్లలో సామాన్య ప్రజల వాటా ఎంత? లేక అదంతా కార్పొరేట్లకే చెందుతుందా, వారెన్నడూ చర్చించరు. వాస్తవానికి ఏ ఆర్థిక వ్యవస్థ బలమైనా దాని పౌరులు ఎలా లబ్ధిపొందుతారు, ప్రభుత్వం వారికి ఎటువంటి అవకాశాలు కలుగజేస్తుంది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. వామపక్షం బలపరిచిన యుపిఎ మొదటి ప్రభుత్వంలో సామాజిక భద్రత పథకాలు పెద్ద ఎత్తున విస్తరించటాన్ని భారతదేశం చూసింది. అవి జనాభాలోని అన్ని తరగతులకు లబ్ధిచేకూర్చాయి; రాజ్యాంగం కింద లభ్యమయ్యే హక్కుల పరిధిని ఇతోధికంగా విస్తృతపరిచాయి. ఈ హక్కులు అనేకం. మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 2005, కింద పనిహక్కు; సమాచార హక్కు చట్టం, 2005, కింద ప్రభుత్వ చర్యలను తెలుసుకునే హక్కు, షెడ్యూల్డు తెగలు, ఇతర సాంప్రదాయక అటవీ నివాసితుల చట్టం (అటవీ హక్కుల గుర్తింపు) 2006, చట్టం కింద అడవులపై గిరిజనులకు హక్కు కల్పించటం, విద్యాహక్కు చట్టం, 2009, కింద ఉచిత, నిర్బంధ విద్యకు హక్కు కల్పించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21–ఎని అమలు చేయటం వాటిలో ఉన్నాయి. ఈ పథకాలు ప్రతి గృహాన్ని చేరాయి . బలంగా పెరుగుతున్న సామాజిక రంగం ప్రాతిపదికపై భారతదేశం తన జనాభా పొందిక నుండి లబ్ధిపొందటానికి సిద్ధంగా

> ప్రధానమంత్రి మోదీ, ఆయన వందిమాగధులు ఐదు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అనే బోలు వాగ్దానాన్ని ఖాళీ డబ్బాలో గులకరాయిలా గలగలలాడిస్తున్నారు. ఆ ఆర్థిక వ్యవస్థ రూపం, స్వభావం గూర్చి వారెన్నడూ చర్చించరు. ఆ ఐదు ట్రిలియన్ డాలర్లలో సామాన్య ప్రజల వాటా ఎంత? లేక అదంతా కార్పొరేట్లకే చెందుతుందా.

ఉంది. ప్రజలకోసం వారిపై పెట్టుబడి పెట్టటం, విద్య, పని, భద్రత, సమాచారం ద్వారా మరిన్ని అవకాశాలు కల్పించటం, వాటిని ఉపయోగించుకునేందుకు వీలు కల్పించటంపై దృష్టి కేంద్రీకరించబడింది. క్రియాశీలమైన ప్రజాస్వామ్యానికి ఈ ఉపపద్దులన్నీ కీలకమైనవి.

అధిక స్థాయి వాగాడంబరం ప్రదర్శిస్తున్న మోదీ ప్రభుత్వం ఈ కీలకమైన హక్కుల పరిధిని విస్తరించవచ్చు. కాని తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. మోదీ ప్రభుత్వం ఎంజినోరెగా కింద వేతనాలను గణనీయంగా పెంచలేదు. పనిదినాల పెంపుదల, వేతనాల పెంపు డిమాండ్‌లు చెవిటి చెవులకెక్కలేదు. సమాచార హక్కు చట్ట పెద్ద ఎదురుదెబ్బలకు గురైంది. ప్రభుత్వ జవాబుదారీతనానికి సంబంధించిన ఇబ్బందికరమైన సమాచారం వెల్లడించకుండా ముఖ్య సమాచార అధికారి హోదాను కుదించారు. గిరిజనుల వనరుల్లోకి పెద్దగా చొరబాట్లు జరిగాయి. వారికి సర్వసాధారణఃగా దక్కాల్సిన వాటిని కార్పొరేట్ దోపిడీకి అప్పగించారు. కార్పొరేట్ లాబీయింగ్ కారణంగా దట్టమైన అడవుల్లో మైనింగ్ అనుమతించారు. గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన అన్ని రూల్సు రెగ్యులేషన్స్‌ను తుంగలోతొక్కారు. విద్యహక్కు పరిధి స్థిరంగా ఉండగా, దాని పరిధి కింద 14–18 వయో గ్రూపును పెంచాలని డిమాండ్ కొనసాగుతున్నది. భారీగా పెరుగుతున్న విద్య ప్రైవేటీకరణ, ప్రభుత్వ విద్యపట్ల

> మోదీ ఎన్నికల విజయాలకు ప్రాతిపదిక మతం, కుల మార్గాల్లో ప్రజలను విభజించటం, బిజెపి యేతర రాజకీయ పార్టీల మధ్య కృత్రిమమైన విభేదాలు సృష్టించటం, మీడియాను నియంత్రించటం, స్వేచ్ఛగా సమాచార ప్రసారాన్ని నిలుపుచేయటం, ఎన్నికల బాండ్‌లనుంచి డబ్బు పోగుచేసుకోవటం, విమర్శించే గొంతుకలను నిరంకుశ చట్టాలతో, ఇ.డి. సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయటం ద్వారా బెదిరింపులకు గురిచేయటం.

నిర్లక్ష్యం, పాఠ్య ప్రణాళికలో హేతురహితమైన మార్పులు వాటిన్నింటినీ కలిపిచూచినపుడు మన భావితరాలు వినాశకర పర్యవసానాలకు గురికానున్నాయి. 14–18 వయో గ్రూపులోని గ్రామీణ బాలల్లో అత్యధికులు 3వ తరగతి లెక్కలు చేయలేకపోతున్నారని, 25 శాతం మందికి పైగా చదవలేకపోతున్నారని విద్య ప్రతిపత్తిపై వార్షిక నివేదిక తెలుపుతున్నది. మోదీ ప్రభుత్వం మన దేశ భవిష్యత్‌ను బలిపెడుతూ కార్పొరేట్లకు ప్రాధాన్యత ఇస్తున్నది. అది మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రజల పునాదులపై దెబ్బ తర్వాత దెబ్బ కొడుతున్నది.

మోదీకింద కార్పొరేట్లవైపు వినాశకరమైన మలుపువల్ల, నిరుద్యోగం గత 45 సంవత్సరాల్లో ఎన్నడూలేనంత స్థాయికి చేరింది. బిజెపిగాని లేదా ప్రధానమంత్రిగానీ దీనిగూర్చి నోరుమెదపరు. 'అచ్ఛేదిన్' లో ఏటా 2 కోట్ల ఉద్యోగాలకు గ్యారంటీ ఏమైంది? నిరుద్యోగుల్లో 83 శాతం యువత అని భారతదేశంపై నివేదికలో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఒ) నివేదిక తెలిపింది. బిజెపి తమ దుష్పరిపాలనవల్ల ఒక తరం ఆకాంక్షలను కాలికింద నలిపివేసింది; మతాన్ని ఉపయోగించి యువతను తప్పుదారి పట్టించటం కొనసాగిస్తున్నది.

బిజెపి పరిపాలనలో వంటగ్యాస్ ధర రెట్టింపునకు పైగా పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) సామాన్య ప్రజల జీవితాలను కఠినతరం చేస్తున్నది. మన శ్రమజీవుల్లో అత్యధికుల నిజవేతనాలు నిశ్చలంగా ఉన్నాయి. కాగా బిజెపి రామమందిరం, సిఎఎ వంటి అంశాలపై విభజన తేవటంపై కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. బిజెపి అంతటి అవినీతి పార్టీ మరొకదాన్ని స్వతంత్ర భారతదేశం చూడలేదని రాజ్యాంగవిరుద్ధమైన ఎన్నికల బాండ్ల పథకం రుజువు చేసింది. రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసిన, వ్యవస్థీకృతం చేసిన ప్రధానమంత్రిగా మోదీ చరిత్రలో మిగిలిపోతారు. కార్పొరేట్లతో మోదీ అవినీతి వ్యవహారాలు, క్విడ్ ప్రోకో చర్యలు దేశంలో ఎటువంటి పరిస్థితిని సృష్టించాయంటే, దేశ యావత్ సంపదలో మన జనాభాలో అగ్రస్థానంలో ఉన్న 1 శాతం భారతీయుల వాటా బ్రిటీష్ పాలన కాలంలో కన్నా హెచ్చుగా ఉంది. ఈ నూతన గ్యారంటీలు మోదీ కొత్తగా సమానత్వ బోలుతనంతో కూర్చిన పదబంధం 'అమృత్ కాల్' అనే చెత్తబుట్ట చేరటం ఖాయం.

మోదీ ఎన్నికల విజయాలకు ప్రాతిపదిక మతం, కుల మార్గాల్లో ప్రజలను విభజించటం, బిజెపి యేతర రాజకీయ పార్టీల మధ్య కృత్రిమమైన విభేదాలు సృష్టించటం, మీడియాను నియంత్రించటం, స్వేచ్ఛగా సమాచార ప్రసారాన్ని నిలుపుచేయటం, ఎన్నికల బాండ్‌లనుంచి డబ్బు పోగుచేసుకోవటం, విమర్శించే గొంతుకలను నిరంకుశ చట్టాలతో, ఇ.డి. సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయటం ద్వారా బెదిరింపులకు గురిచేయటం. రాజకీయాల్లో వంశపారంపర్యతకు, అవినీతి రాజకీయాలకు వ్యతిరేక ఛాంపియన్ కావటానికి మోదీ ప్రయత్నింస్తుండగా, బిజెపియే వంశపారంపర్యతకు నిలయం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎవరికైనా చక్కని ఆశ్రయం అవుతున్నది. బిజెపి మోదీలు తమ 'గ్యారంటీలు' అన్నింటి విషయంలో పూర్తిగా రాజీ పడుతున్నారు. మోదీ పాలనలో తమ పరిస్థితులు అంతకు మునుపటికన్నా దిగజారాయని ప్రజలు గుర్తిస్తున్నారు. నిరుద్యోగం, అసమానత, ఆరోగ్యం, విద్య, వేతనాలు, ఆహార భద్రత, గృహవసతి వగైరా తక్షణ సమస్యలపై ఈ ప్రజలను సమీకరించటం మనముందున్న కర్తవ్యం. ఈ సమస్యలపై ఐక్యంగా పోరాటం చేస్తున్న ప్రజలు – డబ్బు, కేంద్ర ఏజన్సీలు, ప్రాంతీయ విభజనలను ఉపయోగించిన

> లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్ పునాదులను మనం కాపాడుకోవాలంటే, ఆర్ఎస్ఎస్ – బిజెపిలను, వాటి ఏహ్యకరమైన హిందూత్వ భావజాలాన్ని తప్పక ఓడించాలి. డాక్టర్ అంబేద్కర్ గారి జోస్యం లాంటి సలహా దేశంలో ప్రజాస్వామ్యయుత మనస్కులైన వారందరి చెవుల్లో గణగణ హెచ్చరిక గంటలు మోగించాలి.

తదుపరి కూడా మీకు విజయం సిద్ధించబోదని బిజెపికి పాఠం చెబుతారు

మన రాజ్యాంగానికి, అందులో పొందుపరిచిన ఆదర్శాలకు ఆర్ఎస్ఎస్ వారి హిందూత్వ భావన నుండి ఎదురవుతున్న ప్రత్యక్ష ప్రమాదం భవిష్యత్ ఈ ఎన్నికల్లో ఫలితాలపై ఆధారపడి ఉంటుది. హిందూత్వ అనేది ప్రజలను వారి మతం, కులం, లింగం ప్రాతిపదికపై వేరుపరిచే రాజకీయ భావజాలం. సమానత్వాన్ని మన రిపబ్లిక్‌కు పునాదిరాయిగా నెలకొల్పేందుకు స్వాతంత్ర్యోద్యమం పాటుపడగా, మతాలు, కులాలు, లింగాల నిమ్నోన్నతాలను సమాజాన్ని ఆదేశించే వ్యవస్థగా ఆర్ఎస్ఎస్ చూస్తున్నది. మన రాజ్యాంగంపట్ల వారి ద్వేషంలో దాపరికం లేదు.

బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం పీఠికలో పొందుపరిచిన సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాత్రం కోసం మనదేశం చేస్తున్న కృషికి గత దశాబ్దంలో ప్రధానమైన ఎదురుదెబ్బలు సంభవించాయి. హిందూత్వ ఏహ్యకరమైన ప్రయాణం తన వాగాడంబరంతో మన దేశాన్ని మతాధిపత్య, రాచరిక పాలన కాలాల్లోకి – వెనక్కు నెట్టటానికి ప్రయత్నిస్తున్నది. మనం ఒక దేశం– ఒక పన్ను నుంచి ఒక మతం, ఒక భాష, ఒక పార్టీ, ఒక నాయకుడు దిశగా ప్రయాణిస్తున్నాం. ఈ వ్యక్తి పూజ పర్యవసానాలను భావితరాలు అనుభవిస్తాయి.

లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్ పునాదులను మనం కాపాడుకోవాలంటే, ఆర్ఎస్ఎస్ – బిజెపిలను, వాటి ఏహ్యకరమైన హిందూత్వ భావజాలాన్ని తప్పక ఓడించాలి. డాక్టర్ అంబేద్కర్‌గారి జోస్యం లాంటి సలహా దేశంలో ప్రజాస్వామ్యయుత మనస్కులైన వారందరి చెవుల్లో గణగణ హెచ్చరిక గంటలు మోగించాలి. రాజ్యాంగ నిర్ణాయక సభలో ఆయన ఇలా చెప్పారు : "హిందూ రాజ్యం వాస్తవికమైనట్లయితే, అది నిస్సందేహంగా ఈ దేశానికి అతిపెద్ద దురదృష్టమవుతుంది.... అది ప్రజాస్వామ్యంతో పొసగదు. ఏ మూల్యమైనా చెల్లించుకుని హిందూరాజ్య స్థాపనను నిరోధించాలి". మన దేశంలోని లౌకిక ప్రజాతంత్ర శక్తులందరి ముందున్న ప్రశ్న – ఎంతటి శ్రమదమాదులకోర్చి అయినా మన స్వాతంత్ర్యోద్యమ వారసత్వాన్ని కాపాడుకోవటానికి మనం సిద్ధంగా ఉన్నామా? బ్రిటిష్ రాజ్ నుండి మన దేశాన్ని విముక్తంగావించటానికి మన దేశ పురుషులు, స్త్రీలు, మత, కుల , భాష, ప్రాంతం విభజనను అధిగమించి ఐక్యంగా పోరాడారు. మన దేశాన్ని, దాని భవిష్యత్‌ను కాపాడుకునే నిమిత్తం ఆర్ఎస్ఎస్–బిజెపి రాజ్‌ను ఐక్యంగా ఓడించాల్సిన సమయం ఇప్పుడు అరుదెంచింది.

# మేధకు పునాది పుస్తకం



పుస్తక పఠనాన్ని అలవాటు చేద్దాం

అద్భుతమైన మేధాశక్తిని పెంపొందించడానికి ఉన్న మార్గాల్లో అత్యంత విస్తారమైనది, కీలకమైనది పుస్తకం. శిలాఫలకాలు లేదా తాళపత్రాలు.. చర్మం దొంతరలు లేదా కాగితాలు.. పఠన మార్గాలు, వివిధ దశల్లో రూపాంతరం చెందుతూ చాలాకాలం పుస్తకాల రూపంలో స్థిరపడ్డాయి. డిజిటల్ యుగం ప్రారంభమైన తర్వాత, పలు రకాలు సామాజిక మాధ్యమాలు కూడా పాఠకులను అలరిస్తున్నాయి. అయితే, పుస్తకానికి ఉన్న విలువ పుస్తకానిదే. ఆ స్థానాన్ని భర్తీ చేయడం అసాధ్యం. ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం జరుపుకొంటున్న నేపథ్యంలో, వీటి ప్రయోజనాలను ఒకసారి సింహావలోకనం చేసుకోవడం అవసరం. పుస్తకం ఏకాగ్రతను పెంచుతుంది. ఒక విషయాన్ని అర్థం చేసుకోవడానికి తగినంత ఏకాగ్రత అవసరం. పుస్తకాల్లో ఉన్న విషయాలను ఆకళింపు చేసుకునేందుకు ఏకాగ్రత చాలా ముఖ్యం. డిజిటల్ ఏజ్‌లో ఒక ఇన్స్టారీల్‌ను లేదా యూట్యూబ్ షార్ట్స్‌ను కూడా పూర్తిగా చూడలేనంత అసహనం ప్రతి ఒక్కరిలో నెలకొంది. ముఖ్యంగా యువతలో ఈ పరిస్థితి మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. ఒకదాని వెంట మరొకటిగా వెంటవెంటనే స్క్రోలింగ్ చేస్తూ, తదుపరి రీల్ కోసం వేటాడడం అందరికీ అనుభవమే. అయితే, పుస్తకం అలా కాదు. ప్రతి పేజీని అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ఇది మన సహనం, ఏకాగ్రతలకు పని, మెదడుకు పదును పెడుతుంది. ఆయా అంశాల్లో మన సామర్థ్యాన్ని పెంచుతుంది.

భాష పై పట్టు కోల్పోవడం ఈ రోజుల్లో తరచుగా గమనిస్తున్న సమస్య. మాతృభాష తెలుగు పదాలు కూడా తెలియవని చెప్పడం ఫ్యాషన్ అయింది. తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ ఇత్యాది భాషలను కలిపేసిన 'పైశాచిక భాష' ఇప్పుడు గొప్పగా చలామణి అవుతున్నది. ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. ప్రస్తుత కాలంలో అనేకానేక అంశాల గురించి తెలుసుకోవడానికి అవసరం కూడా. కానీ, మాతృ భాషను మరచిపోవడం మాత్రం క్షంతవ్యం కాదు. ఎవరి మాతృ భాషపై వారు పట్టును పెంచుకోవడంతోపాటు, ఇతర భాషలపైనా అవగాహన కోసం పుస్తకాలు తోడ్పడతాయి. పుస్తక పఠనం వల్ల కొత్తకొత్త పదాలకు అర్థం తెలుస్తుంది. పద సంపద (vocabulary) పెరుగుతుంది. సంభాషణ నైపుణ్యం పదును తేలుతుంది. రాసే విధానం మారుతుంది. విభిన్న రచనా శైలి అలవడుతుంది. పుస్తక పఠనంతో ప్రాపంచిక విషయాలు తెలుస్తాయి. రచయిత తన జీవితకాలంలో నేర్చుకున్న పాఠాలు, సంపాదించుకున్న అనుభవాలు పుస్తకాల రూపంలో పాఠకులకు కొన్ని గంటలు లేదా రోజుల్లోనే తెలుస్తాయి. అంటే, ఒకరి జీవితం, పాఠకుడికి కొన్ని గంటల సమయం మాత్రమే. అంతేగాక, ఆయా పుస్తకాల ద్వారా సమకాలీన పరిస్థితులు మన ముందు ఆవిష్కృతమవుతాయి. నాటి సమాజిక, ఆర్థిక పరిస్థితులు, దేశాలు, ప్రాంతాల మధ్య ఘర్షణలు, నాగరికత, ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు వంటి ఎన్నో విషయాలను సులభంగా తెలుసుకునే గొప్ప మార్గం పుస్తక పఠనం. అనేక అంశాలపై పట్టు పెరగడం వల్ల మేధస్సు పెరుగుతుం ది. ఆలోచనా శక్తి మెరుగవుతుంది. గొప్ప గొప్ప పుస్తకాలు ఎంతో మంది జీవితాలను మార్చేస్తుంటాయి.

ఏప్రిల్ 23
ప్రపంచ పుస్తక
దినోత్సవం

జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్న వారి గాథలు మనకు స్ఫూర్తినిస్తాయి. నిత్యజీవితంలో మనం చేసే పోరాటానికి ప్రాణవాయువుగా నిలుస్తాయి. సానుకూల ఆలోచనలతో ప్రేరణ ఇస్తాయి. బుక్ రీడింగ్ అనేది మనిషిలో ఒత్తిడిని మటుమాయం చేస్తుంది. జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో ఒత్తిడి ఏర్పడడం సహజం. అనేక వైఫల్యాలను చవిచూడాల్సి వస్తుంది. అలాంటి సమయంలో పుస్తక పఠనం అనే వ్యాపకం బాగా మేలు చేస్తుంది. ఒత్తిడి తగ్గిస్తుంది. ఫలితంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు కూడా తగ్గుతాయి. ఈకాలంలో అనేక విజయవంతమైన సినిమాలు, వెబ్సిరీస్లు ఒకప్పటి గొప్ప నవలలే. మనం స్క్రీన్ ముందు ఎక్కువ గడపడం వల్ల, పిల్లలు కూడా అదే పనిచేస్తారు. అదే విధంగా పుస్తకాలను చదవడం వ్యాపకంగా ఎంచుకుంటే, పిల్లలకు రోల్‌మోడల్‌గా నిలుస్తాం. వారికి కూడా పుస్తకాలను చదవడం అలవాటవుతుంది. ఒక మంచి పుస్తకం వారు పూర్తి చేయగలిగితే, ఈ అలవాటు పెరుగుతుందే తప్ప తరగదు. మన జీవితం వెలుపల జరిగే సంగతులు ఎన్నో మనకు పుస్తకాలు నేర్పుతాయి. రచయిత కోణంలో నుంచి వారి అనుభవాలను మనం పంచుకుంటాం. అంటే వారి అనుభవాన్ని మనం అనుభూతి చెందుతాం. ఇతరుల భావాలాను అర్థం చేసుకోగలగడం, వాటిని పంచుకోగలగడం ఎంపథీ. బుక్ రీడింగ్ వల్ల ఇది సాధ్యమవుతుంది. మన దృక్కోణం వెలుపలి ఆలోచనలను మనం గమనిస్తాం. ఇక, చాలా మంది నిద్రలేమితో బాధపడుతుంటారు. స్క్రీన్ ముందు అలా కూర్చుండిపోతారు. టివి, మొబైల్ నిద్రలేమి సమస్యలను మరింత పెంచుతాయి. కానీ పుస్తకాలు చదవడం వల్ల అలాంటి సమస్యలు ఉండవు. పైగా, మీ శరీరానికి ఒక సిగ్నల్ పంపినట్టు అనిపిస్తుం ది. ఫోన్ పక్కన పడేసి పుస్తకం తెరిస్తే నాలుగు మంచి విషయాలు తెలియడమే కాకుండా ఇది నిదురించే సమయం అని మీ మెదడుకు చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. పైగా స్ట్రెస్ తగ్గించే అంశమైనందున మీరు నిద్రపోవడానికి ఉపయోగపడుతుంది. బుక్ రీడింగ్ మీలో గ్రహణ శక్తిని పెంచుతుంది. మీ మెదడును ఎప్పుడూ చురుగ్గా ఉంచే ఈ వ్యాపకం అల్జీమర్స్, డిమెన్షియా వంటి వ్యాధులను సమీపించకుండా చేస్తుంది. వృద్ధాప్యాన్ని ఆలస్యం చేస్తుంది. చాలామంది మానసికంగా ఇబ్బందిపడుతున్నప్పుడు ఒంటరితనాన్ని ఫీలవుతుంటారు. ఆ సమయంలో పుస్తకాలు వారికి మంచి నేస్తాలు. పుస్తక పఠనం వారి డిప్రెషన్ను ఇట్టే దూరం చేస్తుంది. వారి ఒంటరితనాన్ని దరిచేరనీయదు.

సెల్ఫ్ హెల్ప్ బుక్స్ అయితే మీ సమస్యను ఎదుర్కోవడానికి టిప్స్ కూడా అందిస్తాయి. అనేక కొత్త స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా మీలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఎన్నో రకాలుగా ఉపయోగపడే పుస్తక పఠనాన్ని, ఇప్పటికే అలవాటు ఉన్నవారు మరింత ఉత్సాహంగా కొనసాగిస్తారని, కొత్తవారు ఈ రోజు నుంచి పుస్తకాలు చదవడం మొదలు పెడతారని ఆశిద్దాం.

కౌశిక్

లేఖలు

## క్యాన్సర్ ఆసుపత్రిలో సౌకర్యాలు కరువు

హైదరాబాద్‌లోని ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్‌లో కొత్తగా నిర్మించిన నూతన బ్లాక్ (చిన్న పిల్లల వార్డు)లో కనీస తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రోగులు, వైద్యులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా నూతనంగా నిర్మించిన బ్లాక్‌లో 200 మంది క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నపిల్లలు ఉన్నారు. అందులో నీటి సౌకర్యంతో పాటు, తాగునీరు, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చిన్నపిల్లలు ఇక్కట్లు పడుతున్నారు. తక్షణం ఆరోగ్య శాఖ స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి.

పారుపల్లి అమర్ చంద్, ఖమ్మం

## గాంజా నియంత్రణకు చర్యలు ఏవి?

విద్యార్థులు దారి తప్పుతున్నారు. దేశ భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన రేపటి పౌరులు..మత్తుకు బానిసలవుతున్నారు. ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితమైన దురలవాట్లు..నేడు పేద, మధ్య తరగతి వర్గాలకు విస్తరించడం ఆందోళన కల్గిస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం విస్తరించడం ఆవేదన కలిగిస్తుంది. కొద్ది కాలం క్రితం జగిత్యాలలో వెలుగుచూసిన బాలిక ఉదంతం.. అందరినీ కలచి వేసింది. పిల్లలు చివరకు పంక్చర్ వేసే సొల్యూషన్ లిక్విడ్ వాసన పీల్చి మత్తులో తూగేందుకు అలవాటు పడ్డారంటే, పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి. ప్రధానంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లోని పేద విద్యార్థులు మత్తుకు బానిసలు కావడం తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారి తీస్తోంది. దీని నివారణ సవాల్‌గా మారింది. హైదరాబాద్‌లో సైతం యథేచ్ఛగా గాంజా రవాణా, వినియోగం విచ్చలవిడిగా సాగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతుంది. సాఫ్ట్‌వేర్, ఇతర ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగులు, స్టూడెంట్స్, నిరుద్యోగులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లు స్పష్టమైంది.

గాంజా వినియోగం వల్ల మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇది మెదడుపై తీవ్ర ప్రభావం చూపడం వల్ల మానసిక సంఘర్షణతో అనర్థాలు, నేరాలు చేసేలా చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది వినియోగించిన వారిలో చిరాకు, విసుగు, కడుపునొప్పి, ఇతర సమస్యలు తలెత్తుతున్నట్లు స్పష్టమౌతుంది. 15–25 ఏళ్లలోపు యువతే ఎక్కువగా గంజాయికి అలవాటు పడుతున్నట్లు పరిశోధనలో వెల్లడైంది.

తెలంగాణ పోలీసు శాఖ అనేక నియంత్రణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ, శక్తి సరిపోవడం లేదు. శాంతి భద్రతలు, నేరాల ఛేదన, బందోబస్తు..ఇలా వివిధ విభాగాల్లో బిజీగా ఉంటున్న పోలీసులు, గాంజా నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. గాంజా వినియోగాన్ని అరికట్టేందుకు ఇప్పటికే పోలీసు శాఖ ఎబోన్ యూరిన్ కప్ యంత్రంతో పరీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. పోలీసులకు తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో కిట్లను సమకూర్చింది.

ఆంధ్రా, ఒరిస్సా బార్డర్ (ఎఒబి)లో గంజాయి సాగు యథేచ్ఛగా సాగవుతున్నట్లు స్పష్టమౌతుంది. తెలంగాణలో పట్టుబడిన గంజాయి ఇక్కడి నుండే ట్రాన్స్‌పోర్ట్ అయినట్లు నిర్ధారించారు పోలీసులు. అయితే..క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకునే అవకాశాలు తెలంగాణ ప్రభుత్వానికి లేకుండా పోయింది. కేంద్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రణాళికా బద్ధంగా ఐటిడిఎ, గవర్నర్ల ద్వారా అక్కడి గిరిజనులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సిన బాధ్యత ఉంది.

చిలగాని జనార్ధన్

## యుద్ధప్రాతిపదికపై వర్ష నష్టనివారణ చర్యలు : అధికారులను కోరిన కూనంనేని



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి : జిల్లావ్యాప్తంగా సోమవారం కురిసిన వడగండ్ల వాన, భారీ ఈదురుగాలులతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని, తక్షణ మే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా చేసి యుద్ధప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కు, విద్యుత్‌శాఖ జిల్లా అధికారులకు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వడగండ్ల వాన, ఈదురుగాలులతో పేదల ఇళ్ళు, గుడిసెలు నేలమట్టం అయ్యాయని, విద్యుత్ స్థంభాలు నేలకొరిగి అనేక గ్రామాలు, పట్టణాల్లోని బస్తీలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని, తక్షణమే విద్యుత్ పునఃరుద్ధరణ పనులు చేపట్టాలని, ఇళ్ళు కోల్పోయిన పేదలకు తక్షణమే పరిహారం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పూర్తిగా ఇళ్ళు కోల్పోయిన వారికి ప్రభుత్వ గృహ పథకం మంజూరు చేయించాలని, మామిడి, మిర్చి ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని సంబంధిత వ్యవసాయశాఖ అధికారులతో సర్వే ఏపట్టి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్య తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కూనంనేని కోరారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు : ఎఐఎస్ఎఫ్




ప్రజాపక్షం/ముత్తారం : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఎఐఎస్ఎఫ్ చేస్తున్న ఉద్యమాలకు, పోరాటాలకు ఆకర్షితులై పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు ఎఐఎస్ఎఫ్ చేరారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ విద్యార్థిలోకం విద్య ప్రైవేటీకరణ కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మంథని, ముత్తారం మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎడవేనా కౌశిక్, మేదరి కుమార్, మామిడాల సిద్ధార్థ, మడిగే సాయికుమార్, నరేండ్ల విగ్నేష్, సొల్లు సృజన్, అభిరామ్, సాయి మణిదీప్ ,సుజల్ ,అజయ్, వినోద్, రవి వర్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడికి ఎఐటియుసి సన్మానం




ప్రజాపక్షం/కమాన్‌పూర్ : తెలంగాణ వ్యాప్తంగా మేడ్చల్ జిల్లా లో ఏప్రిల్ 10న జరిగిన వెటర్నస్ క్యారం బోర్డు స్టేట్ టోర్నమెంట్ లో లద్నాపూర్ గ్రామానికి చెందిన అడ్డూరి. రాజయ్య మొదటి బహుమతి సాధించిన సందర్భంగా అర్జీ3 ఎఐటియుసి ఆఫీసులో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి. రావు, సెంట్రల్ సెక్రటరీ జూపక. రామచందర్‌రావు, బ్రాంచ్ సెక్రెటరీ, ఎంఆర్‌సి రెడ్డి నాయకులు రాజయ్యకు శాలువతో సన్మానం చేశారు. వైవి రావు మాట్లాడుతూ రాజయ్య సింగరేణిలో పనిచేస్తున్న సమయంలో సింగరేణిలో అనేక క్రీడలలో పాల్గొన్నారని, సింగరేణి కార్మికులు రాజయ్యను ఆదర్శంగా తీసుకొని ఆటలలో రాణించాలని సూచించారు.

## స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లు పరిశీలించిన సిపి



ప్రజాపక్షం/మంచిర్యాల క్రైం : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ లను సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ సందర్శించారు. ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ మొదలు కావడంతో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

### అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరపై సకాలంలో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జివి శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ యార్డులలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి సీజన్‌కు సంబంధించి నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. నాణ్యత ప్రమాణాల ప్రకారం తేమ శాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. వర్షభావ పరిస్థితుల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ లలో నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం

### ఎస్‌పి అఖిల్ మహాజన్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్ పి అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 14 ఫిర్యాదులు స్వీకరించినట్టు తెలిపారు. ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూతగాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలం దిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్‌పి తెలిపారు.

# ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

### మతం పేరుతో బిజెపి రాజకీయం
### ఎంఎల్‌ఎలు ప్రేంసాగర్‌రావు, వివేక్



ప్రజాపక్షం/దండేపల్లి : ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంచిర్యాల ఎంఎల్ఎ కొక్కిరాల ప్రేంసాగర్ రావు, చెన్నూర్ ఎంఎల్ఎ వివేక్ వెంకటస్వామి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా దండేపల్లి మండలం మ్యాదరిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీతో కలిసి వారు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశామని, మరికొన్ని ఎన్నికలు ముగిశాక చేస్తామని స్పష్టం చేశారు. ఐదు ఎకరాల వరకు రైతుబంధు ఇచ్చామని, మిగితా వారికి కూడా ఇస్తామని, ఆగష్టు 15 వరకు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఏకకాలంలో మాఫీ చేస్తామని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో రైతుల పంటలు ఎండిపోకుండా మంత్రి, ముఖ్యమంత్రితో మాట్లాడి సాగు నీరు అందించామన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. గత పది సంవత్సరాల పాటు తెలంగాణను పాలించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఎక్కడ పాలుపోక కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని నిందలు మోపుతుందని విమర్శించారు. మతం పేరుతో బిజెపి రాజకీయం చేస్తుందని, రాముడు మనకు దేవుడు కాదా అని ఆయన ప్రశ్నించారు. కల్లబొల్లి మాటలు చెప్పి యువకులను మతం పేరుతో బిజెపి రెచ్చగొట్టుతుందని, బిజెపి ఉచ్చులో యువత చిక్కవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపిపి గడ్డం శ్రీనివాస్, జడ్‌పిటిసి గడ్డం నాగరాణి త్రిమూర్తి, ఎంపిటిసిలు ముత్యాల శ్రీనివాస్, బొడ్డు కమాలకర్, మన్నే మణెమ్మ, కొంగల నవీన్, కంది హేమలత సతీష్, వనపర్తి మాలిక రవితో పాటు పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

దండేపల్లి : దండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంచిర్యాల, చెన్నూర్ ఎంఎల్ఎలు కొక్కిరాల ప్రేంసాగర్ రావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీలు సోమవారం ఆవిష్కరించారు. చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ పోరాట పటిమ, వీరత్వం గురించి కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి గడ్డం శ్రీనివాస్, జడ్‌పిటిసి సభ్యురాలు గడ్డం నాగరాణి త్రిమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, స్థానిక ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెద్దపల్లి ఎంపి స్థానానికి 14 నామినేషన్లు



ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి సోమవారం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గం సమ్మయ్య, అక్కపాక తిరుపతి (రెండవసెట్), ఆర్నకొండ రాజు, గడ్డం మారుతి, రాముల కార్తీక్, జుమ్మిడి గోపాల్, అంబాల మహేందర్, జనగామ నరేష్, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, జాడి ప్రేమ్ సాగర్ (రెండవ సెట్), దాగం సుధారాణి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మంద రమేష్ తలా ఒక సెట్ దాఖలు చేసారని, స్వతంత్ర అభ్యర్థులు గద్దల వినయ్ కుమార్, బొట్ల చంద్రయ్య లు తలా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని, ఇప్పటి వరకు నాలుగు రోజులు కలుపుకొని ఇరవై ఐదు మంది అభ్యర్థులు మొత్తంగా 31 సెట్ల నామినేషన్ లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.

## సమస్యలే ఎజెండాగా ప్రజలపక్షాన కొట్లాడుదాం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ప్రజల సమస్యలే ఎజెండాగా, కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడుదామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో సోమవారం సిరిసిల్ల పట్టణ క్లస్టర్ స్థాయి సమావేశంలో పాల్గొని పార్లమెంటు ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో చాలా స్థానాల్లో స్వల్ప మెజారిటీ తేడాలో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. పార్లమెంటు ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ఫ్రీ బస్సు తీసేస్తాం అంటున్నారని ప్రజలు ఆలోచన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ మోసపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదని, ఐదేళ్లలో ఒక్క పాఠశాల, ఒక్క కళాశాల తీసుకొచ్చాడా? ఒక్క గుడి కట్టాడా? ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చాడా అని ప్రశ్నించారు. మోడీ పదేండ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని, తెలంగాణకు ఏమి చేయని బిజెపికి, కరీంనగర్‌కు నయాపైసా పనిచేయని బండి సంజయ్‌కు ఓటు ఎందుకు వేయాలో ప్రజల్లో చర్చ పెట్టాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపు వలన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా మే పది న కేసీఆర్ రోడ్ షో సిరిసిల్లలో ఉంటుందని, ప్రతి కార్యకర్త తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం లబ్ధి పొందిన నాయకులు పార్టీని వీడి వెళ్తున్నారన్నారు. కష్ట కాలంలో నా వెంట నిలిచిన మీకు నేను అండగా ఉంటానన్నారు. భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపు కోసం కష్టపడ్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై పార్టీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని, కాంగ్రెస్‌లో చేరని వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని, ఎవరు అధైర్యపడొద్దని, అందరికీ అండగా ఉంటానని కెటిఆర్ భరోసా ఇచ్చారు.

## గడువులోపే ఆదర్శ పాఠశాల పనుల పూర్తి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనులను ప్రారంభించి నిరేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగు నీరు,విద్యుత్ సౌకర్యాలు, సౌర ఫలకల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, స్లాబ్ల మరమ్మత్తులు, గ్రిల్స్ ఏర్పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ఇజిఎస్ కింద మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డిఆర్‌డిఓ విజయలక్ష్మి , ఇంజనీరింగ్ అధికారలు అశోక్ కుమార్, శంకరయ్య, నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, వెంకటేశ్వర్ రావ్, మనోహర్, ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

### సిఎంఆర్ సరఫరాను వేగవంతంగా పూర్తిచేయాలి

నిర్మల్ టౌన్: ఎంఆర్ సరఫరాను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలనీ సూచించారు. నిర్లక్ష్యం వహించిన మిలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, మిల్లుల వారీగా మిల్లింగ్, ధాన్యం నిల్వలపై రిపోర్టులను అందజేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని, మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డిఓలు రత్నాకల్యాణి, కోమల్ రెడ్డి, డిఆర్‌డిఓ విజయలక్ష్మి , డీఎస్‌ఓ నందిత, డిఎం సివిల్ సప్లైయి శ్రీకళ, డిసిఓ నర్సయ్య, డిఏఓ అంజిప్రసాద్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ ఎంపి స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ,జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కతో కలిసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాజర్షిషాకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావులు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఐదు గ్యారెంటీలు అమలు చేశామని త్వరలోనే రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఆత్రం సుగుణను ఎంపిగా గెలిపించుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వచ్చేది ఇండియా కూటమి ప్రభుత్వమన్నారు.



## రోగులకు మెరుగైన వైద్యసేవలు

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సూపరిండెంట్ చెన్నకేశవులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్యులు, సిబ్బందితో వైద్యసేవలపై, పలు అంశాలపై తగిన సూచనలు చేశారు. సమయపాలన పాటిస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు.కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ తుకారం భట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, ఆసుపత్రి సూపరిండెంట్ చెన్నకేశవులు, ఇంజనీర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం

### జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్




ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : లోక్ సభ ఎన్నికలలో భాగంగా మే 13 పోలింగ్ రోజున అర్హత గల ప్రతిఒక్కరు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణ లో ఓటరు సెల్ఫీ బోర్డులను అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, సహాయ కార్మికశాఖ కమిషనర్ వినీతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటుహక్కు వజ్రాయుధమన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా అర్హత గల వారందరు ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, స్వీప్ సమన్వయకర్త రాంచందర్ పాల్గొన్నారు.

# మావోల ఏరివేతకు మరో అస్త్రం ఆపరేషన్ 'కగర్'

### ఐదు రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్ర ఇంటిలిజెన్స్
### మావోయిస్టు ప్రభావిత ప్రాంత అధికారులతో డిజిపి రవిగుప్త అత్యవసర సమావేశం



ప్రజాపక్షం/భద్రాచలం :మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కొనసాగుతున్న యుద్ధంలో భద్రతా బలగాలు వరుస విజయాలను తమ ఖాతాలో వేసుకుంటున్నాయి. వేసవిలో ఆకురాలే కాలం కావడంతో దట్టమైన అడవులు మొత్తం పలుచబడి కూంబింగ్‌కు పరిస్థితులు అనుకూలించడంతో ఈమధ్య కాలంలో జరిగిన ఎదురుకాల్పుల్లో సమారు 80 మంది మావోయిస్టులను హతం చేయగలిగారు. మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న అబూజ్ మండ్ దట్టమైన అడవులు ఎత్తైన కొండల్లో మావోయిస్టు పార్టీ శాశ్వత స్థావరాలను ఏర్పాటు చేసుకుని సమాంతర పాలన సాగిస్తోంది. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్ చేపట్టి ముందుకు సాగుతోంది. ఆ లక్ష్యాన్ని మరింత బలపరుచుకుని దండకారణ్యంలో మావోయిస్టు కదిలకలు లేకుండా చేసేందుకు మరోఅస్త్రం ఆపరేషన్ కంగర్‌కు శ్రీకారం చుట్టుంది. ప్రతీ రెండు కిలోమీటర్లకు ఒక సైనిక శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అబూజ్‌మడ్‌ను ఛేదించే లక్ష్యంగా వేలాది మంది కేంద్ర పారామిలటరీ బలగాలను అడవుల్లోకి పంపుతోంది. అత్యాధునిక అయుధాలను అందించి దండకారణ్యంలో సాగుతున్న సమాంతర పాలనను అంతమొందించేందుకు ఆపరేషన్ కంగర్ పేరుతో కేంద్ర హోం శాఖ మరో అడుగు ముందుకేసింది.

**అప్రమత్తం...** ఛత్తీస్‌గఢ్‌తో పాటు పొరుగున ఉన్న నాలుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిస్సా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల పోలీసులు, పారామిలటరీ బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఇంటిలిజెన్సీ హెచ్చరించింది. దీంతో ఐదు రాష్ట్రాల పోలీస్ బాస్ అలెర్ట్ అయ్యారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని ఈ మధ్య వరుసగా చోటు చేసుకుంటున్న ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు భారీనష్టాన్ని చవిచూశారు. కాంకేర్ జిల్లాలో చోటు చేసుకున్న ఎన్ కౌంటర్‌లో ఏకంగా 29 మంది మావోయిస్టులు ఒకేసారి హతమయ్యారు. ఇది మావోయిస్టు చరిత్రలో అతినష్టంగా చెబుతున్నారు. దీనిని మావోయిస్టు పార్టీకేంద్ర కమిటీ సీరియస్‌గా తీసుకుందని, ప్రతీకారాన్ని తీర్చుకునేందుకు ఆ పార్టీ ఖచ్చితంగా ప్రణాళికలు చేస్తుందని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నిఘా పెంచాలని హెచ్చరించిన దరిమిలా అప్రమత్తమయ్యారు. అబూజ్‌మఢ్‌లోని మావోయిస్టుల స్థావరాలను ఇప్పటికే కనిపెట్టిన భద్రతా బలగాలు ముందు కు సాగి విజయం సాధించాయి. అక్కడి దట్టమైన అడవులు, కొండ చెరుయల్లో శత్రువులను ఛేదించడం అంత సులువైన విషయం కాకపోయినప్పటికీ పెద్దసంఖ్యలో బలగాలు ఆప్రాంతాలను చుట్టుముట్టి జల్లెడ పడుతున్నాయి.

**డిజిపి దిశా నిర్ధేశం...** కేంద్ర ఇంటిలిజెన్సి వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో డిజిపి రవిగుప్తా సోమవారం మావోయిస్టు ప్రభావిత ప్రాంతమమైన భద్రాద్రి కొత్తగూడె ం జిల్లాలో పర్యటించి మూడు జిల్లాల ఎస్‌పిలకు దిశానిర్ధేశాన్ని చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిలాల్లో పోలీస్ అధికారులతో బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటిసి పిఎస్‌పిడిలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మూడు జిల్లాల ఎస్‌పిలకు పలు చూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుదెబ్బతిన్న మావోయిస్టులకు ప్రస్తుతం అనువైన రహస్య స్థావరాలు లేకపోవడంతో తెలంగాణలోని అడవుల్లోకి తలదాచుకునేందుకు వచ్చే అవకాశం ఉందని, దీనిపై నిఘా పెంచాలని చెప్పినట్లు తెలుస్తోంది. నదీ తీర ప్రాంతాలోల నిఘా పెంచాలని, పడవకాచువారితో గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి కొత్తవ్యక్తులు తారసపడితే పోలీసులకు చెప్పాలని కోరాలని తెలిపినట్లు తెలుస్తోంది. అనంతరం ఆయన చర్ల మండల పరిధిలోని పూసుగుప్ప, చెన్నాపురం, ఒద్దిపేట బేస్ క్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

**గట్టి నిఘా...** మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్ కంగర్ ముందుకు సాగనుంది. ఈ క్రమంలో నదీతీరాల వెంట మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు గట్టి నిఘా పెంచాయి. గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి నదులతో పాటు నర్మదా నదీ తీరాల వెంట మావోయిస్టు కదలికలపై డ్రోన్లతో నిఘా పెంచుతున్నారు. పోలీసులు ఫెర్రీ పాయింట్లతో పాటు నదీతీరం వెంట ఉన్న గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అడవుల్లో నుండి తెలంగాణలోనికి ప్రవేశించి తలదాచుకునే అవకాశం ఉన్నందున ఆ దారులన్నింటినీ స్వాదీనంలోనికి తీసుకుంటున్నారు. వాహన తనిఖీలతో పాటు అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న యుద్ధంలో ఏ క్షణం ఏం జరుగుతుందో అంతుపట్టక ఆదు రాష్ట్రాల్లోని అటవీ గ్రామాల ప్రజలు భీతిల్లుతున్నారు.

## మోదీని పోటీకి అనర్హుడిగా ప్రకటించాలి

టిపిసిసి ఉపాధ్యక్షులు జి.నిరంజన్



ప్రజాపక్షం / హైదరాబాద్ : దేశ చరిత్రలో మోదీలా దిగజారి మాట్లాడిన ప్రధానిని ఇప్పటి వరకు చూడలేదని టిపిసిసి ఉపాధ్యక్షులు జి.నిరం జన్ అన్నారు. కాంగ్రెస్ మానిఫెస్టోలో మోడీ ఆరో పించినట్లు దేశ సంపదను, మహిళల వద్ద ఉన్న బంగారాన్ని ఇతరులకు పెంచుతామని ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నిం చారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజస్తాన్‌లో తన ప్రసంగం ద్వారా మోదీ ప్రధానిగా ఉండే నైతిక అర్హత కోల్పోయారని అన్నారు. ప్రధాని బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే, ఎన్నికల్లో పోటీకి ఆయనను ఎన్నికల సంఘం అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇసికి లేఖ రాసినట్లు నిరంజన్ తెలిపారు.

## మ్యానిఫెస్టోలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్

తాటిపాముల వెంకట్రాములు డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలలో పొందపర్చాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. 77 సంవత్సరాల స్వాతంత్ర్యనంతరం కూడా దేశంలో బిసి,ఎస్‌సి,ఎస్‌టి, పీడిత, తాడిత వర్గాలు అణచివేతకు గురవుతున్నారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా, విద్య, వ్యాపార, వాణిజ్య మొదలైన అన్ని రంగాల్లో వెనుకబడి ఉండటానికి రాజ్యాధికారంలో సరైన వాటా లేకపోవడమే ప్రధానమైన కారణమని తెలిపారు. దేశ జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బిసిలు చట్టసభలలో సరైనప్రాతినిధ్యానికినోచుకోలేదన్నారు. దేశవ్యాప్తంగా బిసి కులగణన జరగాలని ,చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని అనేకఉద్యమాలు జరుగుతున్నప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరించడంశోచనీయమన్నారు.

## జనగామ మార్కెట్‌లో రైతుల ఆందోళన



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : గత నాలుగు రోజులుగా మార్కెట్‌లో ధాన్యం నిల్వలు పేరుకుపోయిన నేపథ్యంలో సేవలు ప్రకటించగా సోమవారం పెద్దమొత్తంలో రైతులు ధాన్యం తీసుకువచ్చారు. మార్కెట్‌లోని ధాన్యంతో పాటు రైతులు టాక్టర్లలో తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం నాయకులతో పాటు రైతులు మార్కెట్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రైతు సంఘం జనగామ జిల్లా కార్యదర్శి ఆది సాయన్నతో పాటు పలువురితో అధికారులు చర్చలు జరిపారు. వారి చర్చలు సానుకూలంగా లేకపోవడంతో ఆందోళన ఉద్రిక్తంగా మారింది. దీనితో పోలీసులులు పలువురిని అరెస్ట్ చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు చేయకుండా అరెస్ట్ చేయడం ఏంటని మండిపడుతూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ జనగామ మార్కెట్‌లో అధికారులు, వ్యాపారులు రైతుల చెలగాటం అడుతున్నారన్నారు. తేమ పేరుతో రైతుల్ని వ్యాపారులు దోపిడి చేస్తున్నారన్నారు. మార్కెట్‌లో జరిగే దోపిడిని అరికట్టడంతో పాటు ఎప్పటికి అప్పులు మార్కెట్‌కు వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చొప్పరి సోమయ్య హమాలి యూనియన్ నాయకులు రాజు, రైతు సంఘాల నాయకులు మీట్యానాయక్, చందునాయక్, ఉపేందర్ పాల్గొన్నారు.

## ప్రపంచ కమ్యూనిస్టునేత లెనిన్



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: పేదరికం, మతం, జాతి, వర్ణ అసమానతలు లేని దోపిడి రహిత సమాజం కోసం పరితపించిన కమ్యూనిస్టు ప్రపంచ మహానేత లెనిన్ అని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో రష్యా విప్లవనేత లెనిన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల మల్లేష్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రహమాన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాషబోయిన సంతోష్, వేల్పుల చరణ్, శ్రీపతి వినయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి, యువతను విస్మరించిన బిజెపిని ఓడిద్దాం

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : దేశంలో గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి దుయ్యబట్టారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చిందన్నారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసిన మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించడానికి విద్యార్థి లోకాన్ని ఏకం చేస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ ఎంపిగా బండి సంజయ్ విద్యార్థులు, యువకుల కోసం చేసిందేమీ లేదన్నారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థి, నిరుద్యోగులను విస్మరించిన బిజెపిని ఓడించాలని పిలుపునిస్తూ ప్రచురించిన పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, యువతకు రెండు కోట్ల ఉద్యోగాల భర్తీపై ఏనాడూ బండి సంజయ్ పార్లమెంటులో గొంతెత్తలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో విద్యార్థులు, యువకులు బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం గత పదేళ్ల పాలనలో విద్య, ఉపాధి కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. 2014 ఎన్నికల హామీలో యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని పదేళ్ల అధికారంలో ఉండి భర్తీ చేయలేదన్నారు. విద్యకు ప్రతి బడ్జెట్‌లో కనీసం పది శాతం నిధులు కేటాయించకుండా విద్యారంగం పట్ల వివక్ష చూపారన్నారు. తెలంగాణ విభజన హామీల ప్రకారం, తెలంగాణ విభజన హామీల ప్రకారం తెలంగాణకి విద్యాసంస్థలు కేటాయించకుండా తెలంగాణ విద్యార్థి లోకం పట్ల మోదీ కక్ష్య పూరితంగా వ్యవహరించారన్నారు. జిల్లాలో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని విభజన చట్టం చెబుతున్నా పదేళ్లలో ఎందుకు ఏర్పా టు చేయలేదని ప్రశ్నించారు. బిజెపి హటావో దేశ్‌కి బచావో బిజెపిని ఓడిద్దామని, భారత దేశ విద్యారంగాన్ని కాపాడుకుందామనే నినాదంతో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తామని తెలిపారు. మే 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యార్థి లోకం బిజెపిని ఓడించడానికి సిద్ధం కావాలని మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్, నగర నాయకులు రాజేష్, వినయ్ రెడ్డి, సాయి, సచిన్, శ్రావణ్, అనిరుద్ పాల్గొన్నారు.



## భరత్ మృతి దురదృష్టకరం

నివాళులు అర్పించిన కూనంనేని

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పగడాల భరత్ మృతి అత్యంత దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉద్యమ నేపథ్యం కలిగిన కుటుంబంలో జన్మించి ఎంతో భవిష్యత్తు ఉన్న భరత్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. సోమవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ కొత్తగూడెంలో పగడాల భరత్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా భరత్ చిత్ర పటానికి కూనంనేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో కూనంనేని మాట్లాడుతూ యువతరం ఈ దేశానికి అవసరమున్న దశలో భరత్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. భరత్ మృతి మల్లేష్ కుటుంబానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఆయన తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎస్‌కె జాని మియా, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, జిల్లా నాయకులు తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, ఏఐటియుసి నాయకులు మోహన్‌రావు, కార్పొరేటర్ చామకూరి వెంకన్న, దోరేపల్లి శ్వేత, కాంగ్రెస్ నాయకులు బొమ్మిశెట్టి సత్యం, వి. మల్లయ్య, సంక్రాంతి నాగేశ్వరరావు, మందడపు బ్రహ్మరెడ్డి, బైరు హరినాథ్‌బాబు, సీతల రామసంగం, నాగేశ్వరరావు, గోవిందరావు, బంధువులు నివాళులర్పించారు.

## జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి పిలుపు




ప్రజాపక్షం /నల్లగొండ : ప్రపంచ కార్మికుల దినోత్సవం మే 1న 138వ మే డే వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామిలు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు,పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించకుండా కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేసి కార్మిక చట్టాలు పునరుద్ధరణకై పార్లమెంటు ఎన్నికలలో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని కోరారు. వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులకు రావలసిన పెండింగ్ జీతాలను చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయీద్ , ఎడమ సుమతమ్మ, దోటి వెంకన్న, కోశాధికారి డి వెంకన్న, జిల్లా నాయకులు ఎండి జానీ, శంకర్ ,గుండె రవి,వెంకట్ రాములు,కోట్ల శోభ ,వి లెనిన్,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలల..

# ఫీజుల దోపిడీపై ప్రభుత్వ కఠిన చర్యలు

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్పొరేట్ జూనియర్ కాలేజీలు, పాఠశాలల ప్రైవేట్ ఫీజుల దోపిడీపై ప్రభుత్వ కఠిన చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో సోమవారం ఆర్. కృష్ణయ్య భేటీ అయ్యారు. కార్పొరేట్ కళాశాలల్లో, పాఠశాలలు, ప్రధానంగా శ్రీ చైతన్య, నారాయణ తదితర యాజమాన్యాలు విచ్చలవిడిగా హద్దు పద్దు లేకుండా ప్రతి సంవత్సరం ఫీజులు పెంచుతున్నారని వెంకటేశంకు తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరానికి రూ.3 లక్షలు, ఏసి ఉన్న కళాశాలలకు రూ. 3 లక్షల, 50 వేలు ఫీజులు తీసుకుంటున్నారని అన్నారు. పాఠశాల స్థాయిలో కూడా 34 లక్షలు వసూలు చేస్తున్నారని బుర్రా వెంకటేశం దృష్టికి తీసుకపోయారు. ఇంటర్‌తో పాటు నీట్ జేఈఈ లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్‌లకు ఇంకా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని, ఒక కాలేజీకి, పాఠశాలకు పర్మిషన్ తీసుకొని హైదరాబాద్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో వందల సంఖ్యలో కళాశాల బ్రాంచ్‌లు పెంచి అక్రమంగా నడుపుతున్నారని చెప్పారు. ఇంతకు ముందు అనుమతులు ఉన్న నడవలేని, సంఖ్యలేని కాలేజీలను, పాఠశాలలను తీసుకొని, వాటి పేరుపై పర్మిషన్, తీసుకొని ఈ పేరు మీద వేరే బోర్డు పెట్టి కాలేజీలు, పాఠశాలలు నిర్వహిస్తున్నారు. కాలేజీ అడ్మిషన్‌లకు ప్రభుత్వం నోటిఫికేషన్ షెడ్యూలు జారీ చేయలేదన్నారు. కానీ ఈ కార్పొరేట్ కాలేజీలు మధ్యలో బ్రోకర్లను పెట్టి 10వ తరగతిలో ఉన్న విద్యార్థుల అడ్రస్ తీసుకొని ఇంటికి వెళ్లీ మాయమాటలు చెప్పి అడ్మిషన్లు తీసుకుంటున్నారని వివరించారు. ఇంటర్ బోర్డు విద్యాశాఖ నియంత్రణలో ఈ కాలేజీలు, పాఠశాలలున్నాయా ? లేవా? అనే అనుమానం కలుగుతుందన్నారు. అనుమతులిచ్చే వరకే ఇంటర్ బోర్డు పరిమితం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చి, ఈ కాలేజీల, పాఠశాలల దోపిడిని అడ్డుకోవాలని ఆర్.కృష్ణయ్య వెంకటేశంను కోరారు. ఈ భేటీలో జాతీయ బి.సి. సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, పెరికె సురేశ్, రాజేందర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, మోదీ రాందేవ్, చంద్రశేఖర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర వ్యవసాయ విధానం రూపొందించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర వ్యవసాయ విధానం ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ డిమాండు చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు అంజనేయులు అధ్యక్షతన జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన బాలకిషన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం దివాలా తీసిందని ఆరోపించారు. నయా ఉదార వాద ఆర్థిక విధానాలే వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టబడిందని విమర్శించారు. సిపిఐ వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా తెచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఉపాధి పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించడం లేదని కూలీలకు సక్రమంగా జీతాలు చెల్లించకుండా అనేక అక్రమాలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిపోతున్న ధరలలో వ్యవసాయ కూలీల జీవనం అస్తవ్యస్తంగా మారిందని వాపోయారు. వ్యవసాయంపై తొంభై శాతం ఎస్సీ, ఎస్టీ బిసి అట్టడుగు వర్గాల కార్మికులే ఆధారపడి జీవిస్తున్నారని ఇలాంటి కార్మికులు సంక్షేమం పట్ల ప్రభుత్వాలకు చిన్న చూపు తగదని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధనకు వ్యవసాయ కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**వ్యవసాయ కార్మిక సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక** : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిపిఐ అనుబంధం మహబూబ్‌నగర్ జిల్లా నూతన జిల్లా సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సత్యనారాయణరెడ్డి ప్రధాన కార్యదర్శి గా యం.గోవర్ధన్ , ఉపాధ్యక్షులుగా జంగయ్య, సహ కార్యదర్శిగా ఏటవాలు మాసన్న, కమిటీ సభ్యులుగా బాలనరసయ్య, రామ చంద్రయ్య, జంగయ్య, బాలయ్య , సాయిలు, నాగన్న, వెంకటయ్య, శేఖర్, కవిత తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేశ్, డి.రాము, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వివిధ మండలాల కార్మికులు జంగమ్మ, మల్లేశ్, నర్సింలు, బాలరాజు, మోహన్ శ్రీను, లక్ష్మన్న, శేఖర్, అరుణ్, చిన్న జంగయ్య, శివనాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, గీత, రాధా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ టెస్టులతో మానసిక ధైర్యం

ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ నేతలు బాగం, పోటు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలని, మోడల్ టెస్టుల ద్వారానే మానసిక ధైర్యం పెంపొందుతుందని ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ నేతలు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు తెలిపారు. ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నిట్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని డాక్టర్స్ అకాడమీలో మోడల్ నిట్, ఇంజనీరింగ్ ప్రశ్నా పత్రాలను బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు ఆవిష్కరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కలుగుతుందని అదేవిధంగా మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నిట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ఉండడానికి 25 ఏళ్లుగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నిట్ విద్యార్థులకు మోడల్ నిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులు సమయం వృధా కాకుండా పరీక్ష ఎలా రాయాలో అనేది తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, డాక్టర్స్ అకాడమీ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, నాయకులు శివ, వంశీ, బాలాజీ, ప్రతాప్, రాకేష్, రోహిత్, రాహుల్, స్వరూప, రేణుక పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై ప్రధాని అసత్య ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ పూర్తిగా చేసి తీరుతామని సిఎం పునరుద్ఘాటించారు.

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతాం**

గత పదేండ్ల బిజెపి, బిఆర్‌ఎస్ ప్రభుత్వ హా యంలో ఆదిలాబాద్ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, ప్రధాని మోదీ ఆదిలా బాద్ జిల్లాకు ఏమీ చేశారో సమాధానం చెప్పాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన జన జాతర సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతామని, దీనికి అంబేద్కర్ పేరు పెడుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. బోథ్ నియోజక వర్గంలోని కుప్టి ప్రాజెక్టును కాంగ్రెస్ హాయంలోనే పూర్తి చేసి, అన్నదాతలకు సాగు నీరందిస్తామని సిఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో యూనివర్శిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అక్కడ మోదీ, ఇక్కడ కేడీ కలిసి సిమెంట్ ఫ్యాక్టరీని మూలన పడేశారని సిఎం ఆరోపించారు. సిసిఐ సిమెంట్ పరిశ్రమను తెరిపించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామ న్నారు. ఆదివాసీలకు అనేక విషయాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ (సీతక్క), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్‌ను విమర్శించడమే బిజెపి నేతలు పనిగా పెట్టుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు.

**చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తాం**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చక్కెర పరిశ్రమలు పునరుద్ధరణ గురించి ఆలోచించామని, ఇందుకోసం మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని, లోక్‌సబ ఎన్నికల కోడ్ ముగిసిన మూడు నెలలలోపే వీలైతే సెప్టెంబర్ 17 లోపు నిజాం షుగర్స్ పరిశ్రమ తెరిపించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నిజామాబాద్ ప్రాంత రైతులను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ నియోజకవర్గం నుంచి జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కాంగ్రెస్ జాతీయ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేలను ఒప్పింపి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమించే బాధ్యతను తాను తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో బిజెపి ఎంపి పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేశారని సిఎం విమర్శించారు. ఈ బోర్డు ఏర్పాటుపై మోదీ ఇచ్చిన ప్రకటనలో ఎక్కడా నిజామాబాద్ అని లేదని, ఎన్నికలు పూర్తయిన అనంతరం బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తా రో కూడా తెలియదన్నారు. కల్వకుంట్ల కవి త ఎంపిగా ఉన్నప్పుడు ఇక్కడి రైతులను పట్టించుకోలేదని సిఎం విమర్శించారు. పంజాబ్, హర్యానా రైతుల తర్వాత అంత చైతన్యం ఉన్నది ఇందూరు రైతులకేనని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**కెసిఆర్‌తో కొట్లాడే శక్తిని ఇచ్చింది మల్కాజ్‌గిరి ప్రజలే**

తాను రాజకీయంగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపిగా గెలిపించారని, కెసిఆర్‌తో కొట్లాడే శక్తిని ఇచ్చింది మల్కాజ్‌గిరి ప్రజలేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన జన జాతర సభలో ఆయన మాట్లాడుతూ ఈటల రాజేందర్ ఎప్పుడైనా కెటిఆర్ అవినీతి, ఫోన్ ట్యాపింగ్‌పై మాట్లాడారా? ప్రశ్నించారు. తీహార్ జైలులో ఉన్న కుమార్తె కాపాడుకొనేందుకు కోసం బిఆర్‌ఎస్ పార్టీని బిజెపి పార్టీకి తాకట్టు పెట్టి కాంగ్రెస్ అభ్యర్థులను పరాజితులను చేసే లక్ష్యం గా పలు పార్లమెంటు స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను రంగంలోకి కెసిఆర్ దించి చీకటి ఒప్పందం చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ కెసిఆర్, మోదీలు ఎన్ని కుంతంత్రాలు చేసినా ప్రజానీకం నమ్మరన్నారు. హుజురాబాద్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయనందుకే ఈటల రాజేందర్‌ను ఓడించారన్నారు. బిజెపి అధిష్టానవర్గం నిర్ణయాల మేరకే ఈటల ఫోన్ ట్యాపింగ్, గత ప్రభుత్వ అవినీతి పనుల గురించి మాట్లాడడంలేదన్నారు. మల్కాజ్‌గిరి స్థానం కాంగ్రెస్ అడ్డా అని, కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు.

**బిఆర్‌ఎస్ వాళ్లు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి**

'బిఆర్‌ఎస్‌లో ఉన్న వారికి ఒక్కటే చెబుతున్నానని... మీరు మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి. బిఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుంది. బిఆర్‌ఎస్ అభ్యర్థులకు వేసే ప్రతి ఓటు మూసీలో వేసినట్లే'నని రేవంత్ రెడ్డి అన్నారు.

### కాంగ్రెస్‌కు కామ్రేడ్‌లకు కుదిరిన దోస్తీ

**సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్**

భువనగిరిలో జరిగిన సభ విజయవంతమైన నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షులు, సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీతో దోస్తీ కుదిరినట్లు పేర్కొన్నారు. సిఎం చేసిన ట్వీట్ యథాతథంగా..

'భువనగిరి పాదాల వద్దగగన మంత ఎత్తున ఎగసి అభిమాన కెరటాలు.. త్యాగాల స్థూపాల సాక్షిగాసాగిన జైత్రయాత్ర ఇది కాంగ్రెస్‌కు కామ్రేడ్లకు కుదిరిన దోస్తీ.. కంచుకోటపై ఎగురుతుంది గెలుపు జెండా' అని సిఎం ట్వీట్ చేశారు.



## అమెరికా సిటిజన్‌షిప్

(మొదటి పేజీ తరువాయి)

మారారు. తర్వాత భారత్ (65,960), ఫిలిప్పీన్స్ (53,413), క్యూబా (46,913), డొమినికన్ రిపబ్లిక్ (34,525), వియత్నాం (33,246), చైనా (27,038) ఉన్నాయి. అయితే, భారత్‌లో పుట్టి, అమెరికాలో ఉంటున్నవారిలో దాదాపు 42 శాతం మందికి అగ్రరాజ్య పౌరసత్వం పొందే అర్హత లేదని సిఆర్‌ఎస్ నివేదిక వెల్లడించింది. 2023 నాటికి గ్రీన్ కార్డు లేదా లీగల్ పర్మినెంట్ రెసిడెన్సీ (ఎల్‌పిఆర్) ఉన్న 2,90,000 మంది భారతీయులు సహజీకృత పౌరసత్వం పొందే అవకాశం ఉందని పేర్కొంది. సహజీకృత పౌరసత్వం కోసం వచ్చే అప్లికేషన్ల సంఖ్య 2023 ముగిసే నాటికి 4,08,000గా ఉన్నట్లు సిఆర్‌ఎస్ నివేదిక పేర్కొంది. 2023లో కొత్తగా 8,23,702 మంది ఎల్‌పిఆర్ ఉన్నవారు నేచురలైజేషన్ కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 90 లక్షల మంది వరకు దానికి అర్హత ఉన్నప్పటికీ, చాలా తక్కువ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయని నివేదిక వెల్లడించింది. అగ్రరాజ్య సహజీకృత పౌరసత్వం ఇచ్చేందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. జన్మించిన దేశంతో పాటు కనీసం ఐదేళ్ల పాటు ఎల్‌పిఆర్‌లు అయ్యి ఉండాలి. హోండురస్, గ్వాటిమాలా, వెనిజువెలా, మెక్సికో, ఎల్ సాల్వెడార్, బ్రెజిల్ వారికి తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వియత్నాం, ఫిలిప్పీన్స్, రష్యా, జమైకా, పాకిస్థాన్ వారికి అధిక ప్రాధాన్యం ఉంటుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com